# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

18.03.2026
బుధవారం Wednesday

సంపుటి (volume): 1
సంచిక (Issue): 236

పేజీలు : 12
Pages : 12

వెల రూ. 2.00

Published from : Hyderabad
Circulated to : Telangana



రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి సాక్షి ఆహ్వానం పలుకుతుంది.

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

9119949944
7897222788 - 7897222789




# యూట్యూబర్ వైష్ణవి దారుణ హత్య..!

**'పొట్ట'తో ఉన్న భార్యను..భర్తనే 'పొట్టనబెట్టుకున్నాడు'**

ఏడాదిన్నర క్రితమే ప్రేమ పెళ్లి.. 4 నెలల గర్భిణి

5

# అఫ్గాన్‌లో విషాదం

- కాబూల్ ఆస్పత్రిపై పాక్ వైమానిక దాడి
- దాడిలో 400 మంది మృత్యువాత
- మంటల్లో చిక్కుకున్న ఆస్పత్రి భవనం
- దాడి ఘటనను తోసిపుచ్చి పాక్ ప్రభుత్వం



4



# కాంగ్రెస్‌లో 'సంజయ్' చిచ్చు

తనతో కలసి పని చేయాలనడానికి ఆయన ఎవరు?

- ఇంతకు ఆయన ఏ పార్టీకి చెందిన వారో చెప్పాలి
- నాలుగు దశాబ్దాల కాంగ్రెస్ బంధాన్ని తెంపే కుట్ర
- తాను పార్టీ మారితే అందుకు కారణం సంజయ్ మాత్రమే
- మాజీ ఎమ్మెల్సీ టి. జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

తనను కాంగ్రెస్ నుంచి బయటకు పంపింపేందుకు బిఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్‌ను ఎవరో వెనక ఉండి ప్రోత్సహిస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ టి. జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తనతో కలిసి పనిచేయాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తనకు ఆఫర్ ఇచ్చాడని సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి చెప్పారు.

**జగిత్యాల, మార్చి 17:** అసలు సంజయ్ ఏ పార్టీలో ఉన్నారు?, తనను ఎలా కలిసి రమ్మంటారని మండిపడ్డారు. నేను ప్రస్తుతానికి కాంగ్రెస్ పార్టీలో ఉన్నాను. కాంగ్రెస్‌ని వదిలిపెట్టడానికి సంజయ్ కారణం అవుతారు. సంజయ్‌ని ఎవరు ప్రోత్సహిస్తున్నారో అర్థం కావడం లేదు. ఈ సమస్య పరిష్కారం అవుతుందని నేను అనుకోవడం లేదు. కాంగ్రెస్‌లోని మిత్రులు ఈ విషయంలో మాట్లాడు తున్నారు. నాకు కార్యకర్తల అభిప్రాయాలు ముఖ్యం. కాంగ్రెస్ అధిష్టానంది కూడా బాధ్యతే. నేను పార్టీని వీడటంలో సంజయ్‌ది ఒక్కటే పాత్ర కాదు. ఆరు గ్యారంటీల అమల్లో జాప్యం ఉంది.. అసంతృప్తి ప్రజల్లో ఉంది. నేను పార్టీని వీడితే పార్టీ అగుతుందా?, ఒక్కడు పోతే ఆగదు. కాంగ్రెస్లోకి వచ్చిన 10 మంది ఎమ్మెల్యేలను దూరం పెట్టడమే పరిష్కారం. పార్టీ వారిని దూరం పెడుతుందా?. అలా అయితే కాంగ్రెస్లో సమస్యకు పరిష్కార మార్గం వచ్చినట్టే' అని జీవన్ రెడ్డి సూచించారు.

మిగతా 3 లో




# సిక్స్ ప్యాక్ ఫైల్ ఎక్కడ పోయింది

సీఎం సంతకానికే దిక్కు లేకపోతే ఎలా

ఎక్కడ పోయిందో సిట్ ద్వారా వెతికి పట్టండి

- ఇచ్చిన హామీలను తుంగలో తొక్కింది నిజం కాదా
- గత గవర్నర్ ప్రసంగాలకు.. నేటికి ఏం తేడా
- గవర్నర్ ప్రసంగంలోనే తప్పులు దొర్లితే ఎలా
- ఐటీ సెక్రటరీ ఎవరో వారిని తొలగించండి
- ఢిల్లీకి వెళ్లి నిధులు తేకుండా.. నిధులు ఇచ్చి వస్తున్నారు
- 420 వరల్డ్ కప్ పెడితే కాంగ్రెస్ ఫస్ట్ వస్తుంది
- కాంగ్రెస్ గ్యారెంటీలకు.. ప్రభుత్వానికి జీరో వాల్యూ
- ధన్యవాద తీర్మానంపై ఎందుకు ధన్యవాదాలు తెలపాలి
- తెలంగాణ అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంపై కేటీఆర్ విసుర్లు



**హైదరాబాద్, మార్చి 17:** తెలంగాణ శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో మాటల యుద్ధం నడిచింది. చర్చలో కెటిఆర్ మాట్లాడుతుండగా పలు సందర్భాల్లో మంత్రులు ఆయన ప్రసంగానికి అడ్డుపడ్డారు. ఈ క్రమంలో నేనే రాజు.. నేనే మంత్రి' అని మిడిసిపడ్డ వారు సంపద మూటగట్టుకు పోలేరని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఎన్నికల హామీ దస్త్రంపై సీఎం సంతకం చేశారని 2023 నాటి గవర్నర్ ప్రసంగంలో ఉంది. ఏళ్లు గడిచినా సీఎం సంకల్పం, చిత్తశుద్ధి ఏమైంది? తొలి క్యాబినెట్‌లోనే ఆరు హామీలకు చట్టబద్ధత కల్పిస్తామన్నారు. బహిరంగ వేదికపై సీఎం సంతకం చేసిన దస్త్రం ఏమైందన్నారు. సీఎం ఫైల్‌కే దిక్కు లేకపోతే కాంగ్రెస్ మాటలు ఎవరు నమ్ముతారని, మాయమైన దస్త్రం కోసం సిట్ ఏర్పాటు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రభుత్వానికి ఎవరు ధన్యవాదాలు చెప్పాలి.. ఎందుకు చెప్పాలని ప్రశ్నించారు.

మిగతా 3 లో

# లెక్కలతో సహా అన్నీ వివరిస్తాం

గత ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ఆరోపణలు..

కేటీఆర్ విమర్శలపై సభలో దీటుగా బదులిచ్చిన డిప్యూటీ సీఎం భట్టి



వివరాలు 3వ పేజీలో



రోహిత్ రెడ్డి డ్రగ్స్ కేసులో
## కీలక నిర్ణయం

విచారణకు సిట్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఆదేశం

చేవెళ్ల డీసీపీ యోగేశ్ గౌతమ్ నేతృత్వంలో..

3

పైలట్ రోహిత్ రెడ్డికి
## బీఆర్ఎస్ 'షాక్'

డ్రగ్స్ కేసు నేపథ్యంలో షోకాజ్ నోటీసు జారీ

# తెలంగాణలో ప్రకృతి వ్యవసాయానికి శ్రీకారం

**61 వేల మందికి 'ఫార్మర్ కిట్లు' పంపిణీ**

నేటి నుండి మూడు రోజుల పాటు 'రైతు మహోత్సవం'..

22న నర్సెట్టలో సీఎం చేతుల మీదుగా రైతు భరోసా విడుదల



3

# జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం



- ఇఫ్తార్ వేడుకలు సామరస్యానికి నిదర్శనం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

3



ఉన్నత విద్యామండలి
## కొత్త కోర్సులు

- యూజీ అండ్ పీజీ విద్యార్థుల కోసం 39 స్పెషల్ కోర్సులు
- విజన్ 2047 లక్ష్యంగా కార్యాచరణ
- ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి

2




# రోహిత్ రెడ్డి డ్రగ్స్ కేసులో కీలక నిర్ణయం

## విచారణకు సిట్ ఏర్పాట్లు చేస్తూ ప్రభుత్వం ఆదేశం

## చేవెళ్ల డీసీపీ యోగేశ్ గౌతమ్ నేతృత్వంలో సిట్ ఏర్పాటు

**హైదరాబాద్, మార్చి 17:** రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని బీఆర్ఎస్ నేత పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్ డ్రగ్స్ కేసులో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ వ్యవహారంపై ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్‌ను ఏర్పాటు చేసింది. దీనికి చేవెళ్ల డీసీపీ యోగేశ్ గౌతమ్ నేతృత్వం వహిస్తారని స్పష్టం చేసింది. ఈ మేరకు తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్‌లో జరిగిన పార్టీ వ్యవహారంపై సిట్ విచారణ చేయనుంది. దుబాయ్ లింకులు, డ్రగ్స్ దందా, నమిత్ శర్మ రియల్ వ్యాపారాలు తదితర అంశాలపై సిట్ విచారణ జరపనుంది. ఈ డ్రగ్స్ కేసులో వీటిని ఎక్కడి నుంచి తీసుకు వచ్చారు? ఈ పార్టీలో పాల్గొనేందుకు వచ్చిన వ్యాపారులు ఎవరు? వారికి మీకు ఉన్నా లింకులు, దుబాయ్ లింకులు తదితర అంశాలపై పలు కోణాల్లో విషయాలను రాబట్టేందుకు ఈ సిట్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ వ్యవహారంలో పూర్తి స్థాయి దర్యాప్తు జరిపి ప్రభుత్వానికి సిట్ నివేదికను అందించనుంది. మొయినాబాద్‌లోని పైలట్ రోహిత్ రెడ్డికి చెందిన ఫామ్ హౌస్‌పై ఆదివారం పోలీసులు అకస్మికంగా దాడి చేశారు. ఈ సమయంలో న్యూఢిల్లీకి చెందిన నమిత్ శర్మ.. కాల్పులు జరిపారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు.. వారిని చుట్టిముట్టారు. ఈ సందర్భంగా 11 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరికి డ్రగ్స్ టెస్ట్ నిర్వహించారు. వారిలో పలువురికి పాజిటివ్ వచ్చింది. వారిలో ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ సైతం ఉన్నారు. ఆయనకు కూడా డ్రగ్స్ పరీక్షల్లో పాజిటివ్ వచ్చింది. అలాగే పైలట్ రోహిత్ రెడ్డికి పాజిటివ్ వచ్చింది. ఈ నేపథ్యంలో వీరిద్దరికి వారి వారి పార్టీల నుంచి నోటీసులు అందాయి. ఈ ఘటనపై వివరణ ఇవ్వాలంటూ వారికి ఆయా పార్టీలు స్పష్టం చేశాయి. అప్పటి వరకు పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉండాలంటూ ఆ నోటీసుల్లో పేర్కొన్నాయి.

# రోహిత్ రెడ్డికి బీఆర్ఎస్ 'షాక్'

## డ్రగ్స్ కేసు నేపథ్యంలో షోకాజ్ నోటీసు జారీ

## వారంలోగా వివరణ ఇవ్వాలని ఆదేశం.. పార్టీ కార్యక్రమాలపై నిషేధం



**హైదరాబాద్, మార్చి 17:** డ్రగ్స్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి బీఆర్ఎస్ అధిష్ఠానం గట్టి షాక్ ఇచ్చింది. మొయినాబాద్ ఫామ్‌హౌస్ ఉదంతం పార్టీకి తీవ్ర అపకీర్తి తెచ్చిపెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఆయనకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. మీడియా నివేదికలు మరియు విశ్వసనీయ సమాచారం ప్రకారం మాదకద్రవ్యాల వినియోగంలో ప్రమేయం ఉన్నట్లు వచ్చిన వార్తలపై ఏడు రోజుల్లోగా లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని ఆదేశించింది. పార్టీ అధ్యక్షులు కేసీఆర్ ఆదేశాల మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి సోమ భరత్ కుమార్ ఈ నోటీసులను జారీ చేశారు. ఒక బాధ్యతాయుతమైన రాజకీయ సంస్థగా అక్రమ కార్యకలాపాలను, ముఖ్యంగా మాదకద్రవ్యాల వినియోగాన్ని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ వ్యవహారం వల్ల పార్టీ ప్రతిష్టకు, విశ్వసనీయతకు భంగం కలిగే అవకాశం ఉన్నందున, క్రమశిక్షణా చర్యల కింద ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. వివరణ ఇచ్చే వరకు పార్టీకి సంబంధించిన ఎటువంటి అధికారిక కార్యక్రమాల్లోనూ పాల్గొనవద్దని రోహిత్ రెడ్డికి స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. నిర్ణీత గడువులోగా సంతృప్తికరమైన సమాధానం ఇవ్వని పక్షంలో, పార్టీ రాజ్యాంగం మరియు నియమావళి ప్రకారం ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండానే పార్టీ నుంచి బహిష్కరించడం వంటి కఠిన చర్యలు తీసుకుంటామని అధిష్ఠానం హెచ్చరించింది. చట్టపరమైన నిబంధనలు, నైతిక విలువలకు కట్టుబడి ఉండే తమ పార్టీలో ఇటువంటి నేరపూరిత ఆరోపణలు ఉన్నవారికి తావు లేదని పార్టీ నాయకత్వం స్పష్టం చేసింది. ఈ పరిణామం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో, ముఖ్యంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

# రూ.కోటి దోపిడీ

## కళ్లల్లో కారం చల్లి దోచుకున్న దుండగులు

## వివరాల ఆధారంగా రంగంలోకి పోలీసులు

**హైదరాబాద్, మార్చి 17:** హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి ప్రాంతంలో భారీ దోపిడీ కలకలం రేపింది. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. దుండగులను పట్టుకునేందుకు బృందాలు రంగంలోకి దిగాయి. సోమవారం రాత్రి సుమారు 9:40 గంటల సమయంలో జరిగిన ఈ ఘటనలో స్కూటీపై డబ్బులు తరలిస్తున్న ఇద్దరిపై దుండగులు దాడి చేసి కోటి రూపాయల నగదును దోచుకెళ్లారు. ఈ సంఘటన కూకట్‌పల్లి పిలర్ నెంబర్ 825 సమీపంలో, ఏసీపీ కార్యాలయం పక్కనే జరగడం మరింత సంచలనంగా మారింది. పోలీసుల వివరాల ప్రకారం మహ్మద్ ఖుస్రూ (42), మహ్మద్ అజీముద్దీన్ (38) అనే ఇద్దరు వ్యక్తులు స్కూటీపై కోటి రూపాయల నగదును తరలిస్తున్నారు. వీరు బహదూర్‌పురాకు చెందిన ఏసీ మెకానిక్స్. అనుమానం రాకుండా ఉండేందుకు గోల్డ్ డ్రాప్ కార్టన్ బాక్స్‌లో కోటి రూపాయలను పెట్టుకుని బైక్‌పై తరలించే ప్రయత్నం చేశారు. కూకట్‌పల్లి పిల్లర్ నెంబర్ 825 వద్ద ఏజెంట్లు డబ్బు కలెక్ట్ చేసుకున్నారు. అయితే వీరిని ముందుగానే గమనించిన దుండగులు మూడు బైక్‌లపై ఫాలో అయ్యారు. డబ్బు కలెక్ట్ చేసుకుని కేవలం 100 మీటర్ల దూరం ప్రయాణించగానే.. నలుగురు దుండగులు స్కూటీపై వెళ్తున్న వారిపై కారం పొడి చల్లి దాడి చేశారు. దీంతో బాధితులు కింద పడిపోగా.. వెంటనే నగదు ఉన్న బాక్స్‌ను తీసుకుని దుండగులు పరారయ్యారు. ఈ ఘటనలో ఉపయోగించిన బైక్‌లు ప్యాషన్ ప్లస్, ఎఫ్‌జెడ్ మోడల్స్‌గా పోలీసులు గుర్తించారు. డబ్బు హవాలా నగదై ఉండొచ్చని అనుమానిస్తున్నారు. అలాగే డబ్బు తరలింపు సమాచారం ముందుగానే తెలిసిన వ్యక్తులే ఈ దోపిడీకి పాల్పడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటన అనంతరం పోలీసులు బాధితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. డబ్బు ఎక్కడి నుంచి ఎక్కడికి తరలిస్తున్నారు? ఎవరిది? వంటి వివరాలను సేకరిస్తున్నారు. నిందితులను పట్టుకునేందుకు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ ఘటనతో నగరంలో భద్రతా వ్యవస్థపై మరోసారి చర్చ మొదలైంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

# యువతకు ఉన్నత విద్యామండలి కొత్త కోర్సులు

- యూజీ అండ్ పీజీ విద్యార్థుల కోసం 39 స్పెషల్ కోర్సులు
- విజన్ 2047 లక్ష్యంగా కార్యాచరణ
- ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి



**హైదరాబాద్, మార్చి 17:** తెలంగాణ యువత కోసం ఉన్నత విద్యామండలి ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. ఆధునిక సాంకేతికతకు అనుసంధానం చేస్తూ కొత్త కోర్సులు ప్రవేశపెట్టేందుకు సిద్ధమైంది. 'యూజీ అండ్ పీజీ కోర్సెస్ న్యూ అండ్ ఎమెర్జింగ్ ఏరియాస్' అనే అంశంపై మంగళవారం టి-సాట్ వేదికగా ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రత్యక్ష ప్రసార కార్యక్రమంలో తెలంగాణ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి తాము ప్రతిపాదించే కొత్త కోర్సులకు సంబంధించిన వివరాలు తమ కౌన్సిల్ సభ్యుల సమక్షంలో వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కలలను నిజం చేసేందుకు తెలంగాణలోని అండర్ గ్రాడ్యుయేట్ మరియు పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థుల కోసం సుమారు 39 కోర్సులకు రూపకల్పన చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి విజన్ లో భాగమైన 2047 లక్ష్యాన్ని పూర్తి చేసే ప్రయత్నంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా కొత్త కోర్సులను రూపొందించా మన్నారు. అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు 19 కోర్సులు, పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థుల కోసం మరో 10 కోర్సులను తక్షణమే ఉపాధి కల్పించేవిగా ఆచరణలోకి తేబోతున్నామని, ఏఈడీపీ( అప్రెంటీస్ ఎనేబుల్డ్ డిగ్రీ ప్రొగ్రామ్స్)లో భాగంగా మరో 10 కోర్సులు ప్రవేశపెడుతున్నామని స్పష్టం చేశారు. 2030 సంవత్సరానికీ మూడు లక్షల కోట్ల రూపాయలు వెచ్చించి పబ్లిక్ అండ్ ప్రయివేటు భాగస్వామ్యంతో తెలంగాణాలోని వివిధ రంగాల్లో 20 లక్షల ఉద్యోగాలు ఏర్పడే అవకాశాలున్నాయని, ఆ ఉద్యోగాలను సాధించేందుకు తెలంగాణ యువతను సిద్ధం చేయాలన్న లక్ష్యంతో ఉన్నత విద్యామండలి పనిచేస్తుందని బాలకిష్టారెడ్డి వివరించారు. కళాశాలల్లో క్వాలిటీ టీచింగ్, మానిటరింగ్, అకడమిక్ పార్టిసిపేషన్, రీసెర్చ్ తదితర అంశాలను తప్పనిసరిగా పాటించాలని ఛైర్మన్ సూచించారు. వైస్ ఛైర్మన్ ప్రొఫెసర్ ఎస్.కె.మహమూద్ మాట్లాడుతూ సైబర్ క్రైమ్, సైబర్ సెక్యూరిటీ, డాటా సైన్స్ వంటి ప్రత్యేక కోర్సులలో విద్యార్థులకు ప్రత్యేక అవకాశాలు కల్పించే ప్రయత్నంలో భాగంగా యూనివర్సిటీలకు, ఆయా కళాశాలకు తగిన సలహాలు-సూచనలు అందిస్తున్నామన్నారు. మండలి మరో వైస్ ఛైర్మన్ ఇటిక్యాల పురుషోత్తం మాట్లాడుతూ విద్యార్థులు కోర్సు పూర్తి చేయడంతో పాటు నైపుణ్యం తప్పని సరిగా ఉండాలని సూచించారు. ఎన్ని ఉన్నత చదువులు చదివినా నైపుణ్యం లేని చదువువల్ల ప్రయోజనం, ఉపాధి రెండూ ఉండవన్నారు. కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్ మాట్లాడుతూ యూనివర్సిటీ లేదా కళాశాల తాము నిర్వహించే కోర్సులకు సంబంధించి ఖచ్చితంగా ల్యాబ్స్ నిర్వహించాలని సూచించారు. కొత్త కోర్సులు ప్రారంభించి వదిలివేయడమే కాకుండా వాటిపై తప్పని సరిగా తమ వైపు నుండి ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందని స్పష్టం చేశారు.

# అబద్ధాలు, సెటైర్లు వేయడం మానుకో

- మహిళలకు ఎవరేం చేశారో వారినే అడుగుదాం
- అసెంబ్లీలో కేటీఆర్‌కు కౌంటర్ ఇచ్చిన సీతక్క



**హైదరాబాద్, మార్చి 17:** మహిళలంటే మాజీ మంత్రి కేటీఆర్‌కు చిన్నచూపని మంత్రి సీతక్క అన్నారు. తెలంగాణ శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా కేటీఆర్‌పై మంత్రి సీతక్క విరుచుకుపడ్డారు. కుటుంబ సభ్యులైనా, బయట మహిళలనైనా ఎదగనీయాలంటూ కేటీఆర్‌కు మంత్రి చురకలంటించారు. ఫ్రీ బస్‌పై కేటీఆర్ సెటైర్లు, తప్పుడు ప్రచారం చేశారని మండిపడ్డారు. కేటీఆర్ సత్యదూరమైన మాటలు, ఎగతాళి మాటలు బంద్ చేయాలన్నారు. పదేళ్ళు మంత్రిగా మహిళల కోసం కేటీఆర్ ఏం చేశారని సీతక్క ప్రశ్నించారు. మహిళా సంఘాలు ఐదు లక్షల కంటే ఎక్కువ తీసుకోకుండా బారికేడ్లు పెట్టారని.. ఇప్పుడు ఆ బారికేడ్లను తొలగిస్తున్నామని చెప్పారు. ఎవరి హయాంలో మహిళా సంఘాలు బాగా నడుస్తున్నాయో వెళ్లి మహిళలను అడగాలని మంత్రి సవాల్ చేశారు. అభయ హస్తం డబ్బులను కూడా గత ప్రభుత్వం వాడుకుందని సీతక్క ఆరోపించారు. శ్రీనిధి ద్వారా వడ్డీ లేని రుణాలు మహిళలకు ఇస్తున్నామని మంత్రి వివరించారు. మహిళలకు చెందిన అభయ హస్తం డబ్బులను కూడా గత బీఆర్ఎస్ ప్రభుత్వం వాడుకుందని ఆరోపించారు. కేటీఆర్ అబద్దాలు ప్రచారం చేస్తున్నారని మంత్రి మండిపడ్డారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో తాము పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం మహిళా సంఘాలపై రూ.3000 కోట్ల భారం పెట్టిపోయిందన్నారు. కేటీఆర్ ఒకసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలని అంటూ మంత్రి సీతక్క పేర్కొన్నారు.

# 20న ఫార్మసిస్ట్ పోస్టులకు జాబ్-మేళా

## 100 ఫార్మసిస్ట్ పోస్టుల భర్తీ



**హైదరాబాద్,మార్చి17:** ఉస్మానియా యూనివర్సిటీ లోని ఎంప్లాయిమెంట్ బ్యూరో ఆధ్వర్యంలో అపోలో ఫార్మసీ ఆధ్వర్యంలో ఈ నెల 20 న ఉదయం 11 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నది. ఉస్మానియా యూనివర్సిటీ, ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా ఉన్న ఎంప్లాయిమెంట్ బ్యూరో కార్యాలయంలో ఈ జాబ్ మేళా నిర్వహించనున్నారు. అపోలో ఫార్మసీ లోని ఫార్మాసిస్టు, అసిస్టెంట్ ఫార్మసిస్ట్ లకు చెందిన 100 పోస్టులను ఈ జాబ్ మేళా ద్వారా భర్తీ చేయనున్నారు డీ ఫార్మసీ, బీ ఫార్మసీ, ఎం.ఫార్మసీ, మరియు ఏదైనీ డిగ్రీ చేసిన యువతి యువకులకు18 నుండి 35 సంవత్సరాల వయసు వారికి మాత్రమే ఈ జాబ్ మేళాలో అవకాశం కల్పిస్తున్నట్లు యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఒక ప్రకటనలో తెలియజేసింది. రూ.16,383 నుండి రూ.19,769 వేలవరకు వేతనం ఉండే ఈ ఫార్మసిస్ట్ ఉద్యోగాలకు మరిన్ని వివరాలకు. 8247656356 ను సంప్రదించాలని ఆ ప్రకటనలో కోరారు. విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ తో నేరుగా హాజరు కావాలని ప్రకటనలో పేర్కొన్నారు.



# మేం చేస్తున్న పనులకు ధన్యవాదాలు చెప్పాలి: కోమటిరెడ్డి

**హైదరాబాద్, మార్చి 17:** కేటీఆర్ వ్యాఖ్యలకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కౌంటర్ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ధన్యవాదాలు చెప్పాలని అన్నారు. 'రేషన్ కార్డు ఇచ్చినందుకు ధన్యవాదాలు చెప్పాలి. యంగ్ ఇండియా స్కూల్ కట్టినందుకు, ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ఇచ్చినందుకు, ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చినందుకు ధన్యవాదాలు చెప్పాలని అన్నారు. కేటీఆర్ ఓపికగా ఉండాలని మంత్రి హితవుపలికారు. ఈ ప్రభుత్వం పేదల కోసమే ఉందని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం లక్షల కోట్లు అప్పు చేసిందని.. వాటికి తాము వడ్డీ కడుతున్నామని.. అందుకు ధన్యవాదాలు చెప్పాలంటూ కేటీఆర్‌కు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ధీటైన జవాబిచ్చారు.

# హ్యామ్ రోడ్ల పేరుతో 18వేల కోట్ల కుంభకోణం

## కమిషన్ల కోసం 10 శాతం మొబిలైజేషన్

## కాంగ్రెస్ ఎన్నికల ఖర్చు కోసం రేవంత్ సన్నాహాలు

## బీఆర్ఎస్ నేత హరీష్ రావు ఆరోపణలు



**హైదరాబాద్, మార్చి 17:** తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి సంచలన ఆరోపణలు వెలువడ్డాయి. అసెంబ్లీలో జరిగిన చిట్‌చాట్ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు రాష్ట్రంలో భారీ కుంభకోణం జరుగుతోందని ఆరోపించారు. హ్యామ్ రోడ్ల పేరిట సుమారు రూ.18 వేల కోట్ల స్కాం జరుగుతోందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆనాడు మొబిలైజేషన్ అడ్వాన్స్‌లు ఇస్తే రేవంత్ రెడ్డి వద్దు అని గొడవ పెట్టారని.. ఇప్పుడు 10 శాతం మొబిలైజేషన్ ఇస్తున్నారని హరీష్ రావు మండిపడ్డారు. ఈ రకంగా రాష్ట్రంలో అతిపెద్ద కుంభకోణం జరుగుతోంది. హ్యామ్ రోడ్ల పేరుతో రూ.18 వేల కోట్ల కుంభకోణానికి తెరలేపారు. రోడ్స్ అండ్ బిల్డింగ్స్ లో రూ.12 వేల కోట్లు, పంచాయతీ రాజ్ డిపార్ట్‌మెంట్‌లో రూ.6 వేల కోట్లు కలిపి భారీ స్థాయిలో అవకతవకలు జరుగుతున్నాయి. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం మొబిలైజేషన్ అడ్వాన్స్‌లు ఇస్తే అప్పటి ప్రతిపక్ష నాయకుడు రేవంత్ రెడ్డి వద్దు అని గొడవ పెట్టారు. ఇప్పుడు అదే ప్రభుత్వం 10 శాతం మొబిలైజేషన్ ఇస్తోంది. ఇందులో కమిషన్లు తీసుకుని ఎన్నికల ఖర్చు కోసం పంపబోతున్నారు. ఈ వ్యవహారం పెద్ద స్థాయి స్కాం గా మారే ప్రమాదం ఉంది' అని ఆరోపించారు. ఈ టెండర్లకు సీఓటీ అనుమతి కూడా అవసరం లేకుండా, డిపార్ట్‌మెంట్ స్థాయిలోనే అనుమతులు ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తం 34 టెండర్ ప్యాకేజీలలో ఇప్పటికే 24 టెండర్లు ఓపెన్ చేసినట్లు తెలిపారు. కాంట్రాక్టర్ల మధ్య కుమ్మక్కుతో 20 నుంచి 30 శాతం వరకు అధిక ధరలకు టెండర్లు వేయించారని కూడా ఆరోపించారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపించాలని, ప్రజల డబ్బును కాపాడాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

# ఇరాన్ యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ అమెరికా కీలక అధికారి రాజీనామా

## ఇజ్రాయెల్ ఒత్తిడితోనే యుద్ధం..

## ట్రంప్‌కు 'జాతీయ ఉగ్ర నిరోధక కేంద్రం' డైరెక్టర్ లేఖ

**వాషింగ్టన్, మార్చి 17:** ఇరాన్‌తో యుద్ధం తీవ్రతరమవుతున్న వేళ అమెరికా ప్రభుత్వంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ట్రంప్ ప్రభుత్వం అనుసరిస్తున్న యుద్ధ కాంక్షను నిరసిస్తూ అమెరికా 'జాతీయ ఉగ్ర నిరోధక కేంద్రం' డైరెక్టర్ జో కెంట్ తన పదవికి రాజీనామా చేశారు. ఈ యుద్ధం అమెరికా ప్రయోజనాల కోసం కాకుండా, ఇజ్రాయెల్ మరియు ఆ దేశ లాబీ ఒత్తిడి కారణంగానే సాగుతోందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. ఈ మేరకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు తన రాజీనామా లేఖను పంపారు. తమ దేశానికి ఇరాన్ నుండి ఎటువంటి తక్షణ ముప్పు లేదని, కేవలం ఇజ్రాయెల్ అధికారులు మరియు అమెరికా మీడియాలోని కొందరు ప్రభావవంతమైన వ్యక్తులు చేసిన తప్పుడు ప్రచారమే ఈ యుద్ధానికి దారితీసిందని జో కెంట్ విమర్శించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ.. యుద్ధం వల్ల అమెరికా పౌరుల ప్రాణాలు పోవడమే కాకుండా దేశ సంపద క్షీణిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. "అమెరికా ఫస్ట్" అనే నినాదానికి ప్రస్తుత విదేశాంగ విధానం పూర్తిగా విరుద్ధంగా ఉందని ఆయన లేఖలో పేర్కొన్నారు. గతంలో ట్రంప్ మొదటిసారి అధికారంలో ఉన్నప్పుడు అనుసరించిన విదేశాంగ విధానాలకు తాను మద్దతు ఇచ్చానని, అయితే రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత పరిణామాలు ఆందోళనకరంగా మారాయని కెంట్ వివరించారు. ఇరాన్‌పై దాడి చేస్తే త్వరగా విజయం సాధించవచ్చని అధ్యక్షుడిని తప్పుదోవ పట్టించారని ఆయన ఆరోపించారు. మధ్యప్రాచ్యంలో యుద్ధాలు ఒక ఉచ్చు వంటివని, వాటిలో చిక్కుకోవడం దేశానికి క్షేమకరం కాదని చాలా ఆలోచించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ రాజీనామా ఇప్పుడు అంతర్జాతీయ రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది.

# సిక్స్ ప్యాక్ ఫైల్ ఎక్కడ పోయింది

రైతులు, వితంతువులు, వృద్ధులు, నిరుద్యోగులు ఎవరు ధన్యవాదాలు చెప్పాలని నిలదీశారు. గ్యారంటీ కార్డులను భద్రపరచుకోవాలని చెప్పి మోసం చేయలేదా అని మండిపడ్డారు. ఆరు గ్యారంటీలు ఎక్కడ దాచిపెట్టాలో చెప్పాలన్నారు. కాంగ్రెస్ నేతలు ఢిల్లీ వెళ్లి నిధులు తెస్తారనుకుంటే.. నిధులు ఇచ్చి వస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. గాదులు, ఉషస్సులు వస్తున్నాయ్.. పోతున్నాయ్.. ప్రజల జీవితాల్లో వెలుగులేవని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ ప్రశ్నించారు. ప్రభుత్వం డిజాస్టర్ పాలన సాగిస్తోందని మండిపడ్డారు. ఎగ్గొట్టు, కూలగొట్టు, చెడగొట్టు.. ఇదీ కాంగ్రెస్ ప్రభుత్వ పాలన అని ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఎగనామాలు.. పంగనామాలు.. ఇదేనా ఇందిరమ్మ రాజ్యమని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీల కోసం కోటి 25 లక్షల మంది చేసుకున్న ప్రజాపాలన దరఖాస్తులు ఏమయ్యాయని కేటీఆర్ ప్రశ్నించారు. గ్యారంటీ కార్డులు బాకీ కార్డులుగా మారి వెక్కిరిస్తున్నాయని అన్నారు. ఇండియా క్రికెట్‌లో టీ20 వరల్డ్ కప్ గెలిచింది.. అదే 420 వరల్డ్ కప్ పెడితే కాంగ్రెస్ ఫస్ట్ వస్తుందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం చారాణా పని చేసి.. బారాణ చేసినట్లుగా చెప్పుకుంటుందని అన్నారు. నేనే రాజు.. నేనే మంత్రి అని మిడిసి పడితే మూటకట్టుకుని పోతారని వ్యాఖ్యానించారు. సంక్షేమ పథకాలకు సంబంధించి తొలి సంతకం చేసిన ఫైల్ ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు. మాయమైన ఫైల్ కోసం సిట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మూసీలో ముంచుతున్న ఇండ్లకు జీరో వాల్యూ కాదు.. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక చేసిన తొలి సంతకానికి జీరో వాల్యూ అని తెలిపారు. కాంగ్రెస్ గ్యారంటీ కార్డులకు, డిక్లరేషన్లకు ప్రజల్లో జీర వాల్యూ అని అన్నారు. విశ్వసనీయత కోల్పోయిన కాంగ్రెస్ ప్రభుత్వానికి జీరో వాల్యూ అని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడితే కర్ణుడిని అని చెప్పుకంటున్నాడని..



ఆయన ఎన్నికల ముందు దానకర్ణ.. ఇప్పుడు కుంభకర్ణ అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. డిక్లరేషన్ల కోసం ఢిల్లీ నుంచి విమానాలు వేసుకుని వచ్చారని.. కానీ వాటిని అమలు మాత్రం చేయడం లేదని అన్నారు. ఇక తెలంగాణ ప్రజల సొమ్మును పక్క రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రచారం కోసం వాడుకుంటున్నారని మండిపడ్డారు. పాలకులు ప్రజలకు ఇచ్చిన మాటను నెలబెట్టుకోవాలని కేటీఆర్ తెలిపారు. పార్లమెంటులో రాష్ట్రపతి ప్రసంగం, అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి విలువ ఉండాలని అన్నారు. గవర్నర్ ప్రసంగానికి ప్రాధాన్యత ఉంటుందని వ్యాఖ్యానించారు. కానీ గవర్నర్ ప్రసంగానికి విలువ లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండున్నరేండ్లలో రెండున్నర లక్షలు అందుకున్న కుటుంబాన్ని చూపించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేటీఆర్ ప్రశ్నించారు. మహిళలకు ఇస్తామన్న రూ.2500 హామీ ఏమైందని అడిగారు. నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ అన్నారు.. ఏమైందని నిలదీశారు. గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టడం లేదని మండిపడ్డారు. గ్యారంటీలు, హామీల అమలు విషయంలో ఎందుకింత నిర్లక్ష్యమని కేటీఆర్ ప్రశ్నించారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో రేషన్ కార్డులు ఇవ్వలేదా అని కేటీఆర్ ప్రశ్నించారు. రేషన్ కార్డులు ఇవ్వలేదని నిండు సభలో ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పలేదా అని అడిగారు. పదే పదే అబద్దాలు వల్లె వేస్తే లాభం ఎవరికి అని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పరనింద ఆత్మస్తుతి మానుకోవాలని హితవుపలికారు. మోసాల కాలంలో నిజాలు చెప్పడమే అతి పెద్ద విప్లవం కాదా అని వ్యాఖ్యానించారు. ఇకపోతే 2023లో ఐటీ ఉద్యోగుల సంఖ్య 9.46లక్షలు. తాజాగా గవర్నర్ ప్రసంగంలో ఆ సంఖ్య 9.39లక్షలుగా పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 7వేల ఉద్యోగాలు తగ్గాయనేది వాస్తవమా? కాదా? ఉద్యోగాలు ఎందుకు తగ్గాయి? బీఆర్ఎస్ హయాంలో కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తక్కువగా వచ్చినా రాష్ట్రాన్ని దీటుగా నిలబెట్టాం. మనది కేంద్రంపై ఆధారపడే రాష్ట్రం కాదని కేటీఆర్ అన్నారు. ఈ క్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. మహిళా సంఘాలకు రూ.57 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చినట్లు అసెంబ్లీలో భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందించారు. 'రూ.57 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చినట్లు జీవో చూపించండి. ఇక్కడే రాజీనామా చేసి నేను వెళ్లిపోతాను' అంటూ సవాల్ విసిరారు. అసెంబ్లీని తప్పుదోవ పట్టించవద్దంటూ డిప్యూటీ సీఎంకు సూచించారు. భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలు అబద్ధమని.. రాష్ట్రంలోని మహిళలంతా చూస్తున్నారని కేటీఆర్ అన్నారు. రూ.57 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చామన్నది తప్పు మాట అని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. వంద రోజుల్లో 6 గ్యారంటీలని సినిమా చూపించిందే కాంగ్రెస్ అని.. సోనియా గాంధీని బలిదేవత అని తాము అనలేదని కేటీఆర్ స్పష్టం చేశారు.



## లెక్కలతో సహా అన్నీ వివరిస్తాం

### కేటీఆర్ విమర్శలపై సభలో దీటుగా బదులిచ్చిన డిప్యూటీ సీఎం భట్టి

**హైదరాబాద్, మార్చి 17:** శాసనసభలో గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానం సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన విమర్శలను రాష్ట్ర మంత్రులు తీవ్రంగా తిప్పికొట్టారు. పదేళ్ల కాలంలో చేసిన తప్పులను మర్చిపోయి, ప్రస్తుత ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకోవడం సరికాదని మండిపడ్డారు. ముఖ్యంగా ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కేటీఆర్ వ్యాఖ్యలపై స్పందిస్తూ.. బీఆర్ఎస్ హయాంలో మహిళా సాధికారతను పూర్తిగా గాలికి వదిలేశారని ధ్వజమెత్తారు. మీ ఇంటి ఆడబిడ్డపై మీకు ఎంత గౌరవం ఉందో రాష్ట్రమంతా చూస్తోందని, కానీ రాష్ట్ర మహిళల గౌరవంపై చిన్నచూపు చూడటం తగదని హితవు పలికారు. ప్రభుత్వాన్ని అభాసుపాలు చేయాలనే ఆలోచనతో కేటీఆర్ దారి తప్పి మాట్లాడుతున్నారని విమర్శించారు. తమ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్న ఆరోపణలను భట్టి విక్రమార్క లెక్కలతో సహా తిప్పికొట్టారు. రాష్ట్రంలోని అర్హులైన 53 లక్షల మందికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, 1.06 కోట్ల మందికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని వివరించారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో ప్రజలను వంచించిందని, తాము రూ.22,500 కోట్లతో ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తున్నామని వెల్లడించారు. రైతు భరోసా కింద కేవలం తొమ్మిది రోజుల్లోనే రైతుల ఖాతాల్లో తొమ్మిది వేల కోట్ల రూపాయలు జమ చేశామని, సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తున్నామని సగర్వంగా ప్రకటించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు తాము అసలు, వడ్డీలు కడుతూనే సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. "మీలాగా ఇంటికో ఉద్యోగం ఇస్తామని మోసం చేయలేదు, దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని మాట తప్పలేదు, మూడు ఎకరాల భూమి హామీని గాలికి వదిలేయలేదు" అంటూ గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. రాష్ట్ర అభివృద్ధికి నిర్మాణాత్మక సూచనలు చేస్తే స్వీకరిస్తామని, కానీ పనిగట్టుకుని విమర్శలు చేస్తే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ప్రతి కుటుంబానికి చేకూరుతున్న లబ్ధిని త్వరలోనే పూర్తి వివరాలతో సభ ముందు ఉంచుతామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# కాంగ్రెస్‌లో 'సంజయ్' చిచ్చు

మొదటి పేజీ తరువాయి

సంజయ్ బీఆర్ఎస్‌లో ఉన్నారని స్పీకర్ అంటున్నారని.. కాంగ్రెస్‌లో కలిసి పనిచేయాలని సంజయ్ అంటున్నారన్నారు. తనకు ఆఫర్ ఇవ్వడానికి సంజయ్ ఎవరు? అని.. తాను పార్టీ వీడతానని ఆయనకు చెప్పానా? అని ప్రశ్నించారు. పార్టీ వీడాలనే ఆలోచన రావడానికి కారణం సంజయ్ కాదా? అని.. తమ పార్టీలోకి వచ్చి చిచ్చు పెట్టింది సంజయే అని జీవన్ రెడ్డి ఫైర్ అయ్యారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అసెంబ్లీ లాబీల్లో చేసిన వ్యాఖ్యలపై జీవన్ రెడ్డి స్పందించారు. 'జగిత్యాల ఎమ్మెల్యే తనతో కలిసి పనిచేయాలని నాకు ఆఫర్ ఇచ్చారు. అసలు సంజయ్ ఏ పార్టీలో ఉన్నారు.. నన్ను ఎలా కలిసిరమ్మంటున్నారు. స్పీకర్ ఏమో సంజయ్ బీఆర్ఎస్‌లో ఉన్నారని అంటారు.. సంజయ్ ఏమో కాంగ్రెస్‌లో కలిసి పని చేయాలని అంటారు. సంజయ్ ఎవరు నాకు ఆఫర్ ఇవ్వడానికి?. నేను పార్టీ వీడతనాని ఆయనకు చెప్పానా?. వీడాలని కోరుకోవడం లేదని ఎలా అంటారు?. పార్టీ వీడాలనే ఆలోచన రావడానికి కారణం సంజయ్ కాదా?. మా పార్టీలోకి వచ్చి చిచ్చు పెట్టింది సంజయ్. ఏ పార్టీనో ముందు నువ్వు తేల్చి చెప్పు సంజయ్ అంటూ జీవన్ రెడ్డి ప్రశ్నలు కురిపించారు. నువ్వు ఎవరు కలిసి పనిచేయాలని అంటావు. నాలుగు దశాబ్దాల అనుబంధాన్ని తెంచుకోవడం ఎంత బాధగా ఉంటది?. ఎంత బాధ ఎంత ఇబ్బందిగా ఉంటే పార్టీ వీడాలనే నిర్ణయం తీసుకుంటామో అర్థం చెస్కోవాలి' అని జీవన్ రెడ్డి అన్నారు. నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితం నాది.





బలహీన వర్గాల మహిళకు కేటాయించిన చైర్మన్ సీట్ నుంచి అడబిడ్డను దించేశావు. సంజయ్ చదువుకున్న వాడు, చట్టం కూడా తెలుసు. జగిత్యాల అభివృద్ధి కోసం అని 20 నెలలుగా చెబుతున్నారు. యావర్ రోడ్డు విస్తరణ ఏమైంది సంజయ్. యావర్ రోడ్డు విస్తరణ అభివృద్ధిలో భాగం కాదా?. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్ద మౌళిక సదుపాయాలు అభివృద్ధిలో లేవా?. నేను తీసుకునే ప్రతీ నిర్ణయం రాజ్యాంగ బద్దంగా ఉంటుంది. రాజ్యాంగాన్ని పాటించని వ్యక్తి నాకు నీతులు చెప్తున్నాడు. నేను కాంగ్రెస్లోనే ఉండాలని అనుకుంటున్నా. కానీ ఉండే పరిస్థితులు తేకపోతే ఏమి చేస్తాం. ఇంట్లో వుడుము వస్తే ఇల్లు ఇడిచి పెడతాం.. అలాగే సంజయ్ ఉడుము లాగా వచ్చి కాంగ్రెస్లో చేరాడు. ప్రజలు ఎవరికి ఏ బాధ్యత ఇస్తే అది నిర్వర్తించాలి. ప్రజలు ఇచ్చిన బాధ్యత నిర్వర్తించకుండా ఉంటే వారు ఆ పదవికి అనర్హుడు' అని జీవన్ రెడ్డి మండిపడ్డారు.

## ప్రకృతి వ్యవసాయానికి శ్రీకారం

### 61 వేల మందికి 'ఫార్మర్ కిట్లు' పంపిణీ




**హైదరాబాద్, మార్చి 17:** తెలంగాణ రాష్ట్రంలో రసాయన రహిత వ్యవసాయాన్ని ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్‌లో భాగంగా 61,125 మంది రైతులకు ప్రత్యేక 'ఫార్మర్ కిట్ల' పంపిణీని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం ప్రారంభించారు. సచివాలయం నుంచి నిర్వహించిన 'రైతు నేస్తం' వీడియో కాన్ఫరెన్స్ 86వ ఎపిసోడ్ వేదికగా రంగారెడ్డి జిల్లా రైతులకు కిట్లు అందజేసి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మితిమీరిన ఎరువులు, పురుగుమందుల వాడకం వల్ల మానవ ఆరోగ్యం దెబ్బతిని క్యాన్సర్ వంటి వ్యాధులు ప్రబలుతున్నాయని, ఈ తరుణంలో పూర్వీకుల ప్రకృతి సాగు పద్ధతులే శ్రేయస్కరమని మంత్రి నొక్కి చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 489 క్లస్టర్లను గుర్తించి, 61,125 ఎకరాల్లో ఈ ఏడాది ప్రకృతి వ్యవసాయం సాగు చేయడమే లక్ష్యంగా రూ. 42 కోట్లతో ప్రణాళికలు రూపొందించినట్లు మంత్రి వెల్లడించారు. రైతులకు సాగు మరియు మార్కెటింగ్‌లో తోడ్పడేందుకు క్లస్టర్‌కు ఇద్దరు 'కృషి సఖీ'లను నియమించి, వారికి నెలకు రూ. 5,000 గౌరవ వేతనం చెల్లించనున్నట్లు తెలిపారు. జీవామృతం, బీజామృతం వంటి జీవ ఉత్పాదకాల తయారీ కేంద్రాల ఏర్పాటుకు ఒక్కో కేంద్రానికి లక్ష రూపాయల ప్రోత్సాహకం అందిస్తున్నట్లు చెప్పారు. అలాగే ఫార్మర్ రిజిస్ట్రీ నమోదులో దేశంలోనే తెలంగాణను మొదటి స్థానంలో నిలిపిన అధికారులను ఈ సందర్భంగా మంత్రి అభినందించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మార్చి 20 నుండి 22 వరకు నర్మెట్టలో 'రైతు మహోత్సవం' ఘనంగా నిర్వహించనున్నట్లు మంత్రి ప్రకటించారు. సుమారు 150 స్టాల్స్‌తో ఏర్పాటు చేసే ఈ ప్రదర్శనలో ఆధునిక సాంకేతికతపై రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. ముఖ్యంగా మార్చి 22న ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నర్మెట్ట వేదికగా యాసంగి సీజన్ 'రైతు భరోసా' నిధులను విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా రూ. 20,600 కోట్ల రుణమాఫీని ఒకే దఫాలో చేపట్టామని, ఖరీఫ్‌లోనూ రికార్డు స్థాయిలో 9 రోజుల్లో రూ. 9,000 కోట్లు జమ చేశామని ఆయన గుర్తు చేశారు. ప్రకృతి వ్యవసాయం, ఆయిల్ పామ్ సాగు ద్వారా రైతులు పెట్టుబడి తగ్గించుకుని అధిక ఆదాయం గడించాలని మంత్రి ఆకాంక్షించారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

### ఇఫ్తార్ వేడుకలు సామరస్యానికి నిదర్శనం

### మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి


**హైదరాబాద్, మార్చి 17:** జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని, వారి సమస్యల పరిష్కారానికి సానుకూల నిర్ణయాలు తీసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. పవిత్ర రంజాన్ మాసం క్రమశిక్షణ, సహనం, సేవాభావం, మానవత్వానికి ప్రతీకమని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ , తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియంలో నిర్వహించిన దావత్-ఏ-ఇఫ్తార్ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సమాజంలో అట్టడుగు వర్గాల గొంతుకగా నిలిచే జర్నలిస్టులు కులమతాలకు అతీతంగా ఇఫ్తార్



వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజాస్వామ్యంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వారు వారధిలా పనిచేస్తున్నారని కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. జర్నలిస్టుల అక్రిడిటేషన్ విషయంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని, అక్రిడిటేషన్ కమిటీలో జర్నలిస్టుల సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. అలాగే ఇళ్ల స్థలాల కేటాయింపు, హెల్త్ కార్డుల మంజూరు వంటి అంశాల్లో కూడా సానుకూల నిర్ణయాలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అక్రిడిటేషన్ కార్డుల జారీలో కానీ అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటులో కానీ జర్నలిస్టుల అందరి సలహాలు సూచనలు తీసుకొని ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, ఐజేయూ మాజీ అధ్యక్షుడు దేవులపల్లి అమర్, సుల్తాన్ ఉల్ ఉలూమ్ విద్యాసంస్థల సెక్రటరీ జఫర్ జావేద్, పిస్తా హౌస్ సీఈఓ ఎం.ఏ. మజీద్, టీయూడబ్ల్యూజే అధ్యక్షులు కె. విరాహత్‌అలీ, ప్రధాన కార్యదర్శి కె. రామనారాయణ, టీయూడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షులు ఎం.ఏ. మజీద్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్ మొహియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## నందిని సిధారెడ్డికి సీఎం అభినందనలు

**హైదరాబాద్, మార్చి 17:** ప్రముఖ కవి, రచయిత నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం-2025 లభించడంపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. నందిని సిధారెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. కరోనా మహమ్మారి కాలంలో మానవాళి ఎదుర్కొన్న సంక్షోభాలను, మానవ సంబంధాల విచ్ఛిన్నతలను అనిమేష కవితా సంపుటిలో హృద్యంగా తెలియజేసిన మానవతావాది సిధారెడ్డి అని సీఎం పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ కాలంలో అక్షరాలను ఆయుధాలుగా మలిచి తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని వ్యాప్తి చేసిన ఘనత సిధారెడ్డికి దక్కుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. పలు కవితా సంపుటాలు, రచనలతో ఆధునిక తెలంగాణ సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన సాహితీవేత్తల్లో సిధారెడ్డి ముందువరుసలో ఉన్నారని సీఎం తెలిపారు.



## రాష్ట్రం కోసం ఎన్నిసార్లయినా ఢిల్లీ వెళతాం: శ్రీధర్ బాబు

**హైదరాబాద్, మార్చి 17:** శాసనసభలో గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానం సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన విమర్శలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదేపదే ఢిల్లీకి వెళ్తున్నారని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను తిప్పికొట్టిన మంత్రి.. రాష్ట్ర అభివృద్ధి కోసం, నిధుల సాధన కోసం ఎన్నిసార్లయినా ఢిల్లీ వెళ్తామని స్పష్టం చేశారు. "మేము జాతీయ పార్టీలో ఉన్నాం.. రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రధానమంత్రిని, కేంద్ర మంత్రులను కలవడంలో తప్పేముంది?" అని ఆయన ప్రశ్నించారు. ప్రాంతీయ పార్టీగా ఉండి కూడా గతంలో బీఆర్ఎస్ నేతలు ఢిల్లీ చుట్టూ ఎన్నిసార్లు చక్కర్లు కొట్టారో లెక్కలు తీయాలని ఎద్దేవా చేశారు. కేటీఆర్ మహిళా సాధికారతపై హేళనగా మాట్లాడటం సరికాదని, గత ప్రభుత్వం పావలా వడ్డీ కూడా ఇవ్వలేదని.. తమ ప్రభుత్వం మహిళలకు అండగా నిలుస్తోందని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. టెక్నికల్‌గా చూస్తే బీఆర్ఎస్ హయాంలో ఒక్క రూపాయి కూడా సరిగ్గా రుణం ఇవ్వలేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇవ్వకపోతే మీరు ఈరోజు ఎక్కడ ఉండేవారని, అడ్డగోలుగా మాట్లాడటం కేటీఆర్‌కు అలవాటుగా మారిందని మండిపడ్డారు. గోబెల్స్ ప్రచారంలో బీఆర్ఎస్‌ను మించిన వారు ఈ ప్రపంచంలోనే లేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి నిర్మాణాత్మక సలహాలు ఇస్తారని ఆశించామని, కానీ కేటీఆర్ ఎవరో రాసిన స్క్రిప్ట్‌ను ఊకదంపుడు ఉపన్యాసంలా చదువుతున్నారని మంత్రి విమర్శించారు. కేవలం ప్రభుత్వాన్ని కాపాడుకోవడానికో లేదా రాజకీయ లబ్ధి కోసమో తాము ఢిల్లీకి వెళ్లడం లేదని, కేవలం రాష్ట్ర నిధుల కోసమే ప్రధానిని కలుస్తున్నామని స్పష్టం చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల నుంచి వరుసగా అన్ని ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ పరాజయం పాలైందని, ఆ అసహనంతోనే కేటీఆర్ సత్యదూరమైన మాటలు మాట్లాడుతున్నారని శ్రీధర్ బాబు ధ్వజమెత్తారు.



### సంపాదకీయం

# సమాజానికి చీడలా.. డ్రగ్స్ మహమ్మారి!

ఉడ్తా పంజాబ్... పేరుతో ఆనాడు గోలగోల జరిగింది. పంజాబ్ మాదక ద్రవ్యాలకు నిలయంగా మారింది. అక్కడ యువత పెడదారి పడుతోందని దేశవ్యాప్తంగా ఆందోళన వెల్లువెత్తింది. దీనిపై సినిమాలు వచ్చాయి. ఇప్పుడు దేశంలో ఎక్కడో ఒకచోట మాదక ద్రవ్యాలు పట్టుబడుతూనే ఉన్నాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో గంజాయి రవాణా, మాదక ద్రవ్యాల వినియోగం ఆందోళన కలిగిస్తోంది. గంజాయి మత్తులో అనేకానేక హత్యాచారాలు జరిగాయి. ఇటీవల మదనపల్లెలో ఓ దుండగులు బాలికను హత్యాచారం చేసిన సంగతి చూశాం. మద్యం, మత్తు పదార్థాలు సమాజాన్ని ఛిన్నాభిన్నం చేస్తున్నా పాలకులు పట్టించు కోవడంలేదు. దీంతో గంజాయి బ్యాచ్‌లు రెచ్చిపోతున్నాయి. నిత్యం కాపలా కాసి పట్టుకుంటున్నా గంజాయి రవాణా ఆగడం లేదు. రేవ్ పార్టీలు, ఫామ్ హౌజ్ పార్టీల్లో డ్రగ్స్ విచ్చలవిడి వినియోగం మరింత ఆందోళన కలిగిస్తోంది. ప్రజాప్రతినిధులే డ్రగ్స్ స్వీకరిస్తే సమాజానికి ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారు. మొయినాబాద్ ఫామ్‌హౌజ్‌లో తెలంగాణ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి, ఏలూరు ఎంపి పుట్టా మహేశ్‌లు పట్టుబడడం దారుణం కాక మరోటి కాదు. ఇలాంటి వారిని రాజకీయాల నుంచి తరిమేయాలి. ఇలాంటి వారిని ప్రజాజీవితానికి దూరం చేయాలి. ఇలాంటి వారి వల్లనే నేర సామ్రాజ్యం విస్తరిస్తుంది. డ్రగ్స్ ఎంతటి దారుణానికైనా తెగించేలా చేస్తుంది. ఎక్కడో యూరప్, ఆఫ్రికా దేశాల్లో ఉన్న ఈ దురలవాటు మెల్లగా మనదేశంలోకి అడుగుపెట్టి ఆందోళనకు గురి చేస్తోంది. మెక్సికోలో డ్రగ్స్ మాఫియా డాన్ ఎలా నేర సామ్రాజ్యాన్ని స్థాపించాడో ఇటీవలే చూశాం. అతడిని ఎన్‌కౌంటర్ చేశరు. అలాగే ఇక్కడి నేరాలను కూడా ఆదిలోనే అదుపు చేయకపోతే సమాజానికి క్యాన్సర్‌లా పట్టిపీడిస్తుంది. 1980లో ఎల్మెంచో కాలిఫోర్నియాలో హెరాయిన్ సరఫరా చేస్తూ పోలీసులకు దొరికాడు. కొంతకాలం జైలుశిక్ష కూడా అను భవించాడు. తిరిగి మెక్సికోకి వచ్చాక కొన్నాళ్లు పోలీసుగా పనిచేశాడు. ఆపై అన్ని మెళకువలు తెలుసుకున్నాకదాన్ని వదిలిపెట్టి 2009లో తన డ్రగ్ మాఫియాకు ప్రాణం పోసాడు. అనూహ్యంగా ఆ ముఠా 2015లో 20 మంది పోలీసుల్ని తలలు నరికి చంపేసింది. అప్పట్నించిమెంచో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ జాబితాలోకి చేరిపోయాడు. ఎల్మెంచో వద్దనున్న ఆయుధ సంపత్తి అలాంటిలాంటిది కాదు. సాయుధ వాహనాలు, రాకెట్ లాంఛర్లు, భారీ ఎత్తున ఆయుధాలను కూడా మెక్సికో సైన్యం స్వాధీన పరుచుకొంది. అతని ముఠాలో ఉన్న వాళ్లంతా కిరాయి హంతకులుగా పేరుపడిన వారే. తనకు ఎదురు తిరిగిన ప్రభుత్వాధి కారుల్ని నిర్దాక్షిణ్యంగా చంపేవాడు. ఈ ముఠా మెక్సికో సైన్యానికి సవాల్‌గా మారింది. అతడి నేర సామ్రాజ్యాన్ని పెంచిపోషించిన వారెవరో అందరికీ తెలుసు. ఇది ప్రపంచానికి ఓ గుణపాఠం కావాలి. తెలంగాణ మాజీ న క్సలైట్ నయీమ్‌ను పెంచి పోషించిందెవరో అందరికీ తెలుసు. ఇలా నేరగాళ్లను ప్రోత్సహించడం వల్ల సమాజం ఛిద్రం కాగలదని గుర్తించాలి. అందుకే నేర స్వభావం ఉన్న వారికి ఏ రూపంలోనూ సకహరించ కూడదు. భారాస మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఫాంహౌస్‌లో పట్టుబడిన ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌తో పాటు అతని స్నేహితుడు నమిత్‌శర్మల మత్తు చరిత్ర కొత్త అనుమానాలు రేకెత్తి స్తోంది. మత్తు మందులు వాడే అలవాటు వీరికి గతంలోనూ ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. దిల్లీ వాసి నమిత్‌శర్మ, ఏలూరు ఎంపీ మహేశ్‌ల నుంచి సేకరించిన నమూనాల్లో ఇతర మాదకద్రవ్యాల అవశేషాలు కూడా లభించడమే ఇందుకు కారణమని చెబుతున్నారు. వాస్తవానికి తాజా కేసు దర్యాప్తుతో దీనికి సంబంధం లేకపోయినప్పటికీ మత్తు మందుల సరఫరా మూలాలను గుర్తించేందుకు అవకాశం ఉంటుందన్న ఉద్దేశంతోనే పోలీసులు పాత విషయాలనూ తవ్వితీయబోతున్నారు. పార్టీలో తాము డ్రగ్స్ వాడలేదని నిందితులు తొలుత బుకాయించినప్పటికీ పోలీసుల పరీక్షల్లో మొత్తం 11 మందిలో ఆరుగురికి పాజిటివ్ వచ్చింది. ఇందులో నమిత్‌శర్మ నుంచి సేకరించిన నమూనాల్లో యాంఫిటమిన్, మెథాయాంఫిటమిన్, కొకైన్ ఆనవాళ్లు లభించాయి. పుట్టా మహేశ్ నుంచి సేకరించిన నమూనాల్లో యాంఫిటమిన్, మెథాయాంఫిటమిన్ ఆనవాళ్లు దొరికాయి. మిగతా నలుగురూ కొకైన్ వాడినట్లు తేలింది. పోలీసులు ప్రశ్నించినప్పుడు తాను సిమ్లా నుంచి కొకైన్ తీసుకొచ్చా నని బెంగళూరుకు చెందిన కౌశిక్ రవి వెల్లడించాడు. వారి సోదాల్లోనూ కొకైన్ మినహా ఇతరత్రా మత్తు మందులేవీ అక్కడ దొరకలేదు. కానీ, నమిత్‌శర్మ, పుట్టా మహేశ్‌ల నమూనాల్లో మాత్రం ఇతర మాదక ద్రవ్యాల ఆనవాళ్లు లభించాయి. వారిద్దరూ వీటిని శనివారం జరిగిన పార్టీలో తీసుకున్నారా...? అంతకు ముందే వాడారా..? అనే వివరాలన్నీ తదుపరి దర్యాప్తులో వెల్లడవుతాయని పోలీసులు చెబుతున్నారు. వీటన్నింటినీ పరిశీలిస్తే రోహిత్‌రెడ్డి ఫాంహౌస్‌లో చిక్కిన వారందరికీ కొంతకాలంగా మత్తుమందులు వాడే అలవాటుందని పోలీసులు అంచనా వేస్తున్నారు. పరీక్షలు చేసినపుడు ఆరుగురు డ్రగ్స్ వాడగా, అందులో ఐదుగురు కొకైన్ తీసుకున్నట్లు తేలింది. మొత్తంగా ఈ కేసుతో పాటు గతంలో పట్టుబడ్డ కేసులను కూడా విచారించాలి. అక్రమ సంపాదనకు అలవాటు పడ్డవారు డ్రగ్స్ పార్టీలకు అలవాటు పడుతున్నారు. తెలంగాణ లో గతంలో సినీ రంగాన్ని కూడా మాదకద్రవ్యాల కేసు ఓ కుదుపు కుదిపింది. కానీ ఆ కేసు ఆచూకీ లేకుండా పోయింది. వీటిని ఇలాగే వదిలేస్తే రేపు సమాజానికి సవాల్‌గా మారుతుందని గుర్తించాలి. ఉడ్తా పంజాబ్ కాదు..ఉడ్తా తెలుగు రాష్ట్రాలుగా మారినా ఆశచర్యం లేదు. గంజాయి, డ్రగ్స్‌పై రాజకీయ కేసులే కాకుండా మామూలుగా కూడా ఎక్కడా ఎవరు ఉన్నా కఠిన చర్యలు తీసుకోవాలి. సమాజం చెడిపోక ముందే మేల్కోవాలి.

# మీ సాయం మాకక్కర లేదు

- అమెరికా చాలా శక్తివంతమైన దేశం
- హర్మోజ్ జలసంధి వ్యవహారం చూసుకుంటాం
- మిత్ర దేశాలకు ట్రంప్ ఘాటు హెచ్చరిక

**వాషింగ్టన్, మార్చి 17:** హోర్ముజ్ జలసంధిలో ముడి చమురు రవాణాకు రక్షణగా యుద్ధ నౌకలను పంపించాలన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అభ్యర్థనను పలు దేశాలు తిరస్కరించాయి. ఈ నేపథ్యంలో మంగళవారం మీడియా సమావేశంలో ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇరాన్ విషయంలో తమకు ఎవరి సాయం అవసరం లేదని అన్నారు. 'మాకు ఎవరి అవసరమూ లేదు. అమెరికా శక్తిమంతమైన దేశం. మా మిలిటరీ ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైనది' అని వ్యాఖ్యానించారు. యుద్ధ నౌకలను పంపించాలన్న ట్రంప్ అభ్యర్థనపై నాటో దేశాలు ఆచితూచి స్పందించిన విషయం తెలిసిందే. యుద్ధ నౌకలను పంపే విషయమై చర్చలు జరుగుతున్నాయని యూకే పేర్కొంది. జపాన్ కూడా దాదాపుగా ఇదే ప్రకటన చేసింది. తమకు యుద్ధ నౌకలను పంపే యోచనే లేదని ఆస్ట్రేలియా స్పష్టం చేసింది. అసలు తమను ఈ విషయమై ఎవరూ సంప్రదించలేదని కూడా ఆస్ట్రేలియా కేబినెట్ మంత్రి కేథరిన్ కింగ్ పేర్కొన్నారు. ఇక ట్రంప్ అభ్యర్థనను జర్మనీ నిర్ద్వంద్వంగా తోసి పుచ్చింది. యుద్ధం ప్రారంభించే ముందు అమెరికా గానీ ఇజ్రాయెల్ గానీ తమను సంప్రదించలేదని జర్మనీ ఛాన్సలర్ ఫ్రీడ్రిక్ మెర్జ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తమకు కొన్ని చట్టపరమైన పరిమితులు



ఉన్నాయని చెప్పారు. ఐక్యరాజ్య సమితి, ఐరోపా సమాఖ్య, నాటో నుంచి తమకు అనుమతులు లేవని చెప్పారు. ఇరాన్ విషయంలో నాటో దేశాల నుంచి తాను ఆశించిన స్పందన లేకపోవడంతో ట్రంప్ గతంలోనూ అసంతృప్తి వ్యక్తం చేశారు. కూటమిలో భాగమైనా కూడా వారు అమెరికాకు సాయం చేసేందుకు ముందుకు రావట్లేదని అన్నారు. సమిష్టి రక్షణ బాధ్యతను పట్టించుకోవట్లేదని విమర్శించారు. హోర్ముజ్ జలసంధిని పట్టించుకోకపోతే నాటో దేశాల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని కూడా హెచ్చరించారు. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం తీవ్రమవుతుండటంతో చమురుపై ఆందోళనలు పెరుగుతున్నాయి. పర్షియన్ గల్ఫ్‌లో చమురు నౌకల రవాణాపై ఇరాన్ పట్టు సాధించడంతో ఇంధన భయాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో అక్కడికి యుద్ధ నౌకలను పంపాలంటూ ట్రంప్ ఇచ్చిన పిలుపును మిత్ర దేశాలతో పాటు చైనా తోసిపుచ్చాయి. నాటో కూటమి కూడా ముందుకురాలేదు. ఈ దేశాలు నౌకలను పంపినా, పంపకపోయినా అన్ని విషయాలను గుర్తుంచుకుంటామని ట్రంప్ బెదిరింపు ధోరణిలో మాట్లాడిన సంగతి తెలిసిందే. తన చైనా పర్యటననూ వాయిదా వేసుకుంటానని హెచ్చరించారు.

# అఫ్గానిస్థాన్‌లో పెను విషాదం

- కాబూల్ ఆస్పత్రిపై పాక్ వైమానిక దాడి
- దాడిలో 400 మంది మృత్యువాత
- మంటల్లో చిక్కుకున్న ఆస్పత్రి భవనం
- దాడి ఘటనను తోసిపుచ్చి పాక్ ప్రభుత్వం



**కాబూల్, మార్చి 17:** అఫ్గానిస్థాన్‌లో పెను విషాదం చోటుచేసుకుంది. పాకిస్థాన్ జరిపిన వైమానిక దాడిలో 400 మంది ప్రాణాలు కోల్పోగా.. 200 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. కాబుల్‌లోని ఓ ఆస్పత్రిపై పాకిస్థాన్ వైమానిక దాడి చేసిందని.. ఈ దాడిలో 400 మంది ప్రాణాలు కోల్పోయారని తాలిబన్లు ప్రకటించారు. ఈ దాడిలో ఆస్పత్రి పూర్తిగా ధ్వంసమైందని.. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తాలిబన్ ప్రభుత్వం తెలిపింది. ఇదిలాఉంటే.. అఫ్గాన్ ప్రభుత్వ ఆరోపణల్ని పాకిస్థాన్ కొట్టిపడేసింది. కాబూల్‌లోని ఏ ఆస్పత్రిని కూడా తాము టార్గెట్ చేసుకోలేదని పేర్కొంది. అఫ్గానిస్థాన్ చెప్పేదాంట్లో నిజాలు లేవంది. ఇదిలావుంటే పాకిస్థాన్, అఫ్గానిస్థాన్ దేశాల మధ్య ఘర్షణలు మూడో వారానికి చేరుకున్నాయి. ఇరుపక్షాలు భీకర దాడులకు పాల్పడుతున్నాయి. సరిహద్దుల్లో పాకిస్థాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తోందని.. పాక్ సైనికులు జరిపిన కాల్పుల్లో నలుగురు అఫ్గాన్ సైనికులు చనిపోయినట్లు ఆ దేశాధికారులు చెప్పారు. ఈ ప్రకటన వెలువడిన కొన్ని గంటల్లోనే కాబుల్‌లోని ఆస్పత్రిపై వైమానిక దాడికి పాల్పడినట్లు అఫ్గాన్ ఆరోపించింది.'కాబుల్‌లోని డి అడిక్షన్ సెంటర్‌పై పాక్ వైమానిక దళం దాడి చేసింది. ఈ దాడిలో భారీ ప్రాణ నష్టం జరిగింది. చాలా మంది గాయపడ్డారు. పాకిస్థాన్ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాం. దీనికి తగిన గుణపాఠం చెబుతాం' అని తాలిబన్ ప్రభుత్వ ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ తెలిపారు. అఫ్గానిస్థాన్ రాజధాని కాబూల్‌లోని ఆస్పత్రిపై పాక్ వైమానిక దాడికి సంబంధించిన వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. దాడి అనంతరం ఆస్పత్రిలో భారీ పేలుడు సంభవించడంతో.. ఆకాశంలోని భారీగా మంటలు ఎగిసి పడుతున్న దృశ్యాలు అందులో రికార్డయ్యాయి. మరో వీడియాలో భద్రతా సిబ్బంది టార్చ్‌లైట్ వెలుగులో శిథిలాల కింద నుంచి మృతదేహాలను వెలికి తీస్తుండగా, అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు. కాబూల్‌లోని డ్రగ్స్ రిహాబిలేషన్‌కు సంబంధించిన ఆస్పత్రిపై సోమవారం రాత్రి 9 గంటలకు పాక్ వైమానిక దాడి జరిపిందని ఆఫ్గానిస్థాన్ డిప్యూటీ ప్రభుత్వ ప్రతినిధి హమ్దుల్లా ఫిత్రత్ తెలిపారు. ఈ దాడిలో ఆస్పత్రి భవనం చాలావరకు ధ్వంసమైందన్నారు. 400 మంది వరకు మరణించారని.. 250 మంది గాయపడ్డారని చెప్పారు. వైమానిక దాడులతో ఆస్పత్రి భవనంలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయని.. అదుపులోకి తీసుకురావడానికి అగ్నిమాపక సిబ్బంది కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. దాడిలో మాదక ద్రవ్యాలకు బానిసలైన వారి చికిత్స కోసం ఉపయోగిస్తున్న పరికరాలు చాలా వరకు ధ్వంసమయ్యాయని అఫ్÷-గాన్ ఆరోగ్య శాఖ ప్రతినిధి షరాఫత్ జమాన్ తెలిపారు. మృతుల్లో ఎక్కువగా రోగులే ఉన్నారని పేర్కొన్నారు. కాగా, పాక్ దాడిని ఆఫ్÷-గానిస్థాన్ ప్రభుత్వ ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ తీవ్రంగా ఖండించారు. ఇది అఫ్÷-గాన్ సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘించే చర్యేనని అభివర్ణించారు. కాబూల్‌లోని ఆస్పత్రి లక్ష్యంగా దాడులు చేశారని ఆఫ్÷-గానిస్థాన్ చేసిన ఆరోపణలను పాకిస్థాన్ తీవ్రంగా ఖండించింది. ఆస్పత్రి లక్ష్యంగా ఎటువంటి దాడులు జరపలేదని స్పష్టం చేసింది. తాలిబాన్ సైనిక స్థావరాలు, ఆయుధ గోదాములు, ఉగ్రవాద మద్దతు కేంద్రాలే లక్ష్యంగా కచ్చితమైన దాడి చేశామని పాకిస్థాన్ సమాచార మంత్రిత్వ శాఖ వెల్లడించింది. పౌరులకు, ఆస్తులకు ఎటువంటి నష్టం జరగకుండానే జాగ్రత్త పడుతూనే దాడులు చేశామని స్పష్టం చేసింది.

## కాబూల్ ఆస్పత్రిపై దాడి పిరికిపంద చర్య

### అఫ్గాన్ సార్వభౌమాధికారంపై జరిగిన దాడి
### పాక్ తీరును తీవ్రంగా తప్పపట్టిన భారత్

**న్యూఢిల్లీ,మార్చి 17:** అఫ్గానిస్థాన్‌లోని కాబుల్ ఆసుపత్రిపై పాకిస్థాన్ జరిపిన వైమానిక దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. ఇది పిరికిపంద, అమానుష చర్య అంటూ మండిపడింది. రంజాన్ వేళ ఇలాంటి దాడులకు పాల్పడటం దారుణమని విచారం వ్యక్తంచేసింది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ ప్రకటనను విడుదల చేసింది. పాక్ ది అత్యంత పిరికిపంద, అమానవీయ చర్య. ఈ దారుణమైన మారణహోమాన్ని ఒక సైనిక ఆపరేషన్‌గా కప్పిపుచ్చుకునేందుకు పాకిస్థాన్ ప్రయత్నిస్తోంది. ఇది అఫ్గానిస్థాన్ సార్వభౌమాధికారంపై జరిగిన దాడి. ఈ హేయమైన, నిర్లక్ష్యపూరిత చర్య ప్రాంతీయ శాంతి భద్రతలకు ప్రత్యక్ష ముప్పు. సరిహద్దుల ఆవల ఇలాంటి తీవ్రమైన హింసాత్మక చర్యలతో.. తమ అంతర్గత వైఫల్యాలను పాక్ ఇతరులపై నెట్టాలని చూస్తోంది. పవిత్ర రంజాన్ మాసంలో ఈ దాడికి పాల్పడటం మరింత దారుణం. ఈ నేరపూరిత చర్యకు పాల్పడిన వారిని అంతర్జాతీయ సమాజం జవాబుదారీగా చేయాలి.




పాకిస్థాన్ ఉద్దేశపూర్వకంగా చేస్తున్న దాడులను తక్షణమే అడ్డుకోవాలని భారత విదేశాంగ శాఖ తమ ప్రకటనలో పేర్కొంది. అఫ్గాన్ సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతకు భారత్ ఎల్లప్పుడూ మద్దతు ఇస్తుందని విదేశాంగ శాఖ తెలిపింది. ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించింది. మాదక ద్రవ్యాలకు బానిసైన వారికి చికిత్స అందిస్తున్న కాబుల్‌లోని ఓ ఆస్పత్రిపై సోమవారం రాత్రి పాక్ వైమానిక దాడులు చేపట్టింది. ఈ ఘటనలో ఇప్పటివరకు 400 మంది మరణించినట్లు అఫ్గానిస్థాన్ ప్రభుత్వం ప్రకటించింది. దాడి కారణంగా భవనం పూర్తిగా ధ్వంసమైంది.

## ఇటానగర్‌లో విరిగిపడ్డ కొండచరియలు

### గోడకూలి నలుగురు మృత్యువాత


**ఇటానగర్,మార్చి17:** కొండచరియలు విరిగిపడడంతో గోడ కూలి నలుగురు మృతి చెందారు. ముగ్గురికి గాయాలయ్యాయని ఇటానగర్ అధికారులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. సోమవారం సాయంత్రం ఇటానగర్‌లో నీతి బీహార్ ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. మృతి చెందిన వారిని చోకి తసర్, రతన్ బర్మాన్, గోడక్ రాజా, గోడక్ టాబిన్‌లుగా అధికారులు గుర్తించారు. నిర్మాణ పనుల్లో భాగంగా కొంతమంది కార్మికులు అక్కడ పనిచేస్తున్నారు. ఈ సమయంలోనే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందిన వెంటనే ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందం, జిల్లా యంత్రాంగం అక్కడికి చేరుకుని రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించారు. రెస్క్యూ బృందం ఘటనా స్థలం నుంచి నాలుగు మృతేహాలను వెలికితీశారు. గాయపడిన వారిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు అని ఇటానగర్ ఎస్‌పి జుమార్ బసర్ మీడియాకు వెల్లడించారు.

# ఐసిస్ ఉగ్రవాద సంస్థతో సంబంధాలు

### మొరాదాబాద్‌లో డెంటల్ విద్యార్థి అరెస్ట్

**లక్నో,మార్చి17:** యుపిలో టెర్రరిస్ట్ సంబంధాలు ఉన్నవారిపై దాడులు కొనసాగుతున్నాయి. నిషేధిత ఉగ్రవాద సంస్థ ఐసిస్‌తో ఆన్‌లైన్‌లో సంబంధాలున్నాయనే ఆరోపణలతో 19 ఏళ్ల వైద్య విద్యార్థిని యుపి పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. భారత్‌లో పనిచేస్తున్న ఐసిస్ అనుబంధ ఆన్‌లైన్ నెట్‌వర్క్ కార్యకలాపాలపై కొనసాగుతున్న దర్యాప్తులో భాగంగా, షహరాన్‌పూర్ జిల్లాకు చెందిన హారీష్ అలీని ఆదివారం మొరదాబాద్‌లో అరెస్ట్ చేసినట్లు ఎటిఎస్ ఒక ప్రకటనలో తెలిపింది. బిడిఎస్ (డెంటిస్ట్) రెండో సంవత్సరం చదువుతున్న హారీష్ అలీ, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్‌మీడియా ప్లాట్‌ఫారమ్‌లు మరియు సెషన్, డిస్కార్ట్ వంటి ఎన్‌క్రిప్టెడ్ అప్లికేషన్‌ల ద్వారా ఐసిస్ సభ్యులు, సానుభూతిపరులతో సంబంధాలు కలిగి ఉన్నాడని అధికారులు పేర్కొన్నారు. ఐసిస్ భావజాలాన్ని ప్రచారం చేయడానికి, దేశంలో ఉగ్రవాద సంస్థను బలోపేతం చేయడానికి వ్యక్తులను నియమించడం లక్ష్యంగా ఆన్‌లైన్ గ్రూపులను సృష్టిస్తున్నారని ఎటిఎస్ తెలిపింది. నిందితులు అల్ ఇత్తిహాద్ మీడియా ఫౌండేషన్ అనే పేరుతో ఒక ప్రత్యేక గ్రూపును కూడా నడిపారని, భారత్‌తో పాటు విదేశాల్లో ఐసిస్ నెట్‌వర్క్‌లోని వ్యక్తులతో సంబంధాలు కొనసాగించారని అధికారులు తెలిపారు. లక్నోలోని ఎటిస్ పోలీస్ స్టేషన్‌లో యుఎపిఎ మరియు బిఎన్‌ఎస్‌లోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎటిఎస్ పేర్కొంది.





# యూట్యూబర్ వైష్ణవి దారుణ హత్య..!

## 'పొట్ట'తో ఉన్న భార్యను..భర్తనే 'పొట్టనబెట్టుకున్నాడు'

### ఏడాదిన్నర క్రితమే ప్రేమ పెళ్లి.. ఇప్పుడు నాలుగు నెలల గర్భిణి



- అత్తింటోల్లు రానివ్వకపోతే.. పుట్టింట్లోనే కాపురం
- నెలరోజుల క్రితం మొదలైన 'మనస్పర్థలు'
- వారసత్వంగా వచ్చే 'ఆస్తిపంపకాలపై' భర్త మమకారం
- తల్లితో కొడుక్కి మొదలైన 'రాయబేరాలు'
- ఇంటికి పిలిచి .. కంట్లో కారం కొట్టి 'భర్త-అత్త'ల హత్యాయత్నం?
- 'అబార్షన్' చేయించుకోమని కోడలుపై ఒత్తిడి? కోడల్ని వదిలించుకోమని.. కొడుక్కి 'ప్లాన్'?
- 'వైష్ణవికి-మత్తు' ముందు ఇచ్చి 'మర్డర్ ప్లాన్'.?
- భర్త హరిబాబు 'కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో కాంట్రాక్టు ఉద్యోగి'
- 'వైష్ణవి యూట్యూబ్లో ఫాలోయింగ్' అత్తకు నచ్చకనే విభేదాలు
- భార్యను చంపి..నవ్వుతూ అత్తతో మాట్లాడి.. స్టేషన్ వెళ్లాడని వైష్ణవి కుటుంబ సభ్యుల ఆరోపణ
- 'వాడిని ఉరితీస్తారా.? చేతకాకపోతే మాకు అప్పగించండి మేమే చంపేస్తాం' అంటూ బంధువుల ఆగ్రహం
- కోరుట్లలో సంచలనం సృష్టించిన 'యూట్యూబర్ మర్డర్'-ఉద్రిక్తత



### నాలుగు నెలల గర్భిణీని చంపిన భర్త

జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం మాదాపూర్ గ్రామంలో ఒక 'టీనేజ్ యూట్యూబర్' దారుణహత్యకు గురైన సంఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది.ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త ఏడాది తిరగకుండానే చంపేంత దాష్టికానికి ఒడిగట్టాడు.తమ అన్యోన్య దాంపత్యానికి నిదర్శనంగా భార్య కడుపులో పెరుగుతున్న నాలుగు నెలల పసి ప్రాణాన్ని కూడా బలితీసుకున్నాడు.సోమవారం రాత్రి ఇంట్లో ఆ భార్యాభర్తల మధ్య తీవ్రస్థాయిలో గొడవ జరిగింది. కోపోద్రేకంలో హరిబాబు నాలుగు నెలల గర్భిణి అని కూడా చూడకుండా భార్య వైష్ణవిపై కత్తితో విచక్షణరహితంగా దాడి చేశాడు. తీవ్ర రక్తస్రావంతో ఆమె ప్రాణాలు కోల్పోయింది. అంతేకాకుండా పుట్టబోయే బిడ్డ కూడా కడుపులోనే కన్నుమూసింది.ఇదంతా దాచిపెట్టి.. ఎప్పట్లానే ఏం జరగనట్టు మొహం కడుక్కుని..బైక్ తీసుకుని హరిబాబు గదికి బయట నుంచి గొళ్లెం వేసి, నవ్వుతూ అత్తతో మాట్లాడుతూ..బయటకు వెళ్లిపోయాడని వైష్ణవి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. తెల్లవారుజామున సుమారు 4 నుంచి 5 గంటల మధ్య ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. హంతకుడు ఉదయం 5:30 గంటలకు ఇంటి నుంచి వెళ్లిపోయాడని వైష్ణవి కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

### - సమగ్ర దర్యాప్తు చేపట్టిన పోలీసులు

నిద్ర లేచిన తల్లిదండ్రులు కూతురు గది నుంచి బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చి, తలుపులు తెరవకుండా..కిటికీ లోనుంచి చూసి భయానక దృశ్యం చూశారు. వైష్ణవి రక్తపు మడుగులో నిర్జీవంగా పడి ఉండడం చూసి కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. సమాచారం అందుకున్న కోరుట్ల పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కోరుట్ల సీఐ సురేష్ బాబు నేతృత్వంలో ఎస్ఐ చిరంజీవి మృతదేహాన్ని ప్రభుత్వ హాస్పిటల్ మార్చురీకి తరలించి పోస్ట్‌మార్టం చేయించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. గడిచిన రెండేళ్ల కాలం నుంచి.. వీళ్లిద్దరి పరిచయం.. ప్రేమాయణం.. యూట్యూబ్ వ్యవహారం.. అత్తింటి-పుట్టింటి కలహాలు.. అంశాలపై సిఐ సురేష్ బాబు, ఎస్ఐ చిరంజీవిలు క్షుణ్ణంగా క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు.ఒక 'టీనేజ్' యువతి ప్రాణాలు కోల్పోవడమే కాకుండా, పుట్టబోయే బిడ్డ కూడా కడుపులోనే కన్నుమూయడం ఆ గ్రామంలో విషాద ఛాయలు నింపింది. సోషల్ మీడియాలో ఆమె యాక్టివ్‌గా ఉండటం వల్ల ఏమైనా గొడవలు జరిగాయా.? లేక మరే ఇతర కుటుంబ కలహాలు ఉన్నాయా.? అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.

**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య)**

"కడుపులో 4 నెలల పసిబిడ్డను మోస్తూ, భవిష్యత్తు కలలు కంటున్న ఓ 'టీనేజ్' దాటని యువతి... అదే యువతి తనను ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త చేతిలోనే రక్తపు మడుగులో ప్రాణాలు కోల్పోవడం మాదాపూర్ గ్రామాన్ని కుదిపేసింది.! కన్నంటుకునే రాత్రి పూట.. వినిపించిన అరుపులు కన్నకూతురివే అనుకోలేకపోయారా తల్లిదండ్రులు.! అరుపులు విన్నా..ప్రమాదాన్ని శంకించి కుక్కలు మొరిగినా, ఎన్నడూ లేనంత మొద్దునిద్దుర పోయారు అమాయక తల్లిదండ్రులు. ఎప్పుడూ లేవని అల్లుడు తెల్లవారుజామునే లేచి నవ్వుతూ బయటికి వెళ్లిపోతుండడం అనుమానమొచ్చి, కిటికీలో నుంచి చూసిన భయానక దృశ్యం ఒక్కసారిగా కుటుంబాన్ని శోకసంద్రంలో ముంచేసింది.! యూట్యూబ్‌లో చిరునవ్వులు పంచిన వైష్ణవి... రక్తపు మడుగులో నిర్జీవంగా పడివుండడం అందరినీ షాక్‌కి గురి చేసింది. ఆమె జీవితం 20 ఏళ్లు కూడా రాకముందే ఇలా అర్ధాంతరంగా ముగియడం స్థానికుల కళ్లలో నీరు తెప్పిస్తోంది. కోరుట్ల మండలం మాదాపూర్‌లో చోటుచేసుకున్న యూట్యూబర్ వైష్ణవి దారుణ హత్య సంచలనం సృష్టించింది.!"

### అత్తింటోల్లు రానివ్వకపోతే..పుట్టింట్లోనే ఆశ్రయం

మాదాపూర్‌కి చెందిన గంధం ప్రసాద్-రాణి దంపతుల కూతురు వైష్ణవి(19) కోరుట్ల పట్టణానికి చెందిన చిత్తారి సాయిలు-సాయవ్వ దంపతుల కుమారుడు హరిబాబు ఏడాదిన్నర క్రితం ప్రేమించుకున్నారు. అప్పుడు వైష్ణవి మేజర్ కాలేదని.. హరిబాబు తల్లిదండ్రులు పెళ్లి వాయిదా వేసు చేసుకున్నారు. హరిబాబు..వైష్ణవి మేజర్ అయ్యే వరకు వేచి చూసి మరీ పెళ్లి చేసుకున్నాడు. పెళ్లికి అత్తింటి వారు ససేమిరా అనడంతో.. వైష్ణవి పుట్టింటోళ్లే చేరదీశారు.ఈ క్రమంలో హరిబాబు తాను వైష్ణవినే పెళ్లి చేసుకుంటానని విషం తాగి చస్తానని తెగేసి చెప్పి, తల్లిదండ్రుల నుంచి వేరుపడి ప్రియురాల్ని పెళ్లి చేసుకున్నాడు. అత్తింటోల్లు రానివ్వకపోవడంతో వైష్ణవి పుట్టింట్లోనే, పక్కింట్లోనే కాపురం పెట్టారు.వీరి అన్యోన్య దాంపత్యానికి వైష్ణవి నాలుగు నెలల గర్భిణీ.తల్లి ఇంట్లోనే ఉంటూ, హరిబాబు కూడా భార్యతోనే ఉంటూ కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో కాంట్రాక్టు ఉద్యోగిగా పని చేస్తున్నాడు.

### వైష్ణవిని వదిలించుకుని వస్తేనే ఆస్తి

వైష్ణవి-హరిబాబుల మధ్య ఇటీవల నెలరోజుల క్రితం నుంచే మనస్పర్థలు మొదలయ్యాయి. అదే క్రమంలో కోడల్ని వదిలించుకునేందుకు వారసత్వంగా వచ్చే ఆస్తి పంపకాల ఆశ చూపి కొడుక్కి ఎరవేసింది. ఆస్తిపై మమకారం పెంచుకున్న కొడుకు, తల్లితో ఎప్పట్లానే సంబంధాలు ఏర్పాటు చేసుకున్నాడు.ఇవన్నీ వైష్ణవి కుటుంబంపై ఒత్తిడి తెచ్చాయి. అబార్షన్ చేయించుకోమని కోడలుపై తీవ్ర ఒత్తిడి తెచ్చింది.కోడల్ని వదిలించుకోమని కొడుక్కి ప్రెషర్ పెట్టి ప్లాన్ కూడా ఇచ్చినట్టు కుటుంబ సభ్యులు రోదనల మధ్య ఆరోపించారు.ఇందులో భాగంగానే ఓసారి ఇంటికి పిలిచి కంట్లో కారం కొట్టి భర్త-అత్తలు హత్యాయత్నం చేశారని కూడా వైష్ణవి కుటుంబం ఆరోపించింది.'నువెలాగూ హాస్పిటల్ లో పనిచేస్తున్నావుగా.. మత్తు మందు ఇచ్చి అబార్షన్ చేయుమని తల్లి ప్లాన్ ఇచ్చినట్టు..' వారు ఆరోపిస్తున్నారు.దీనిపై గతంలో పంచాయితీ కూడా జరిగినట్లు సమాచారం.





## యూట్యూబ్‌లో వెలుగులు.. జీవితంలో చీకట్లు

వైష్ణవి యూట్యూబ్‌లో 'Vaishu Amma' అనే ఛానల్ స్టార్ట్ చేసి, ఏడు నెలల్లోనే 48 వేలకు పైగా సబ్‌స్క్రైబర్లు సాధించింది. హోం టూర్ వీడియోలు, గర్భవతి అయిన తర్వాత చేసిన షార్ట్ వీడియోలు మిలియన్లలో వ్యూస్ పొందాయి. వైష్ణవి ఇక లేదన్న వార్త తెలియగానే ఆమె ఛానల్ సబ్ స్క్రైబర్లు కూడా షాక్ కు గురవుతున్నారు.నిన్నటి వరకు నవ్వులు పంచిన ఆ వీడియోలు ఇప్పుడు చూసే వారిని కన్నీళ్లు పెట్టిస్తున్నాయి. గతంలో చేసిన ప్రాంక్ వీడియోల్లో కనిపించిన గొడవలు నిజ జీవిత గొడవలేనా అనే చర్చ కూడా నెటిజన్లలో మొదలైంది.ప్రస్తుతం వైష్ణవి యూట్యూబ్ ఛానల్‌లో గతంలో పోస్ట్ చేసిన వీడియోలు చూసి అభిమానులు షాక్‌కు గురవుతున్నారు. ఒక నిండు ప్రాణాన్ని, పుట్టబోయే బిడ్డను బలి తీసుకున్న ఈ ఘటనపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.





### వాడిని ఉరి తీయండి? లేదంటే.. మేమే చంపేస్తాం'

### - వైష్ణవి కుటుంబ సభ్యులు

భార్యను హత్య చేసి కూడా హరిబాబు నిర్లక్ష్యంగా ప్రవర్తించాడని, నవ్వుతూ అత్తతో మాట్లాడి తర్వాత పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడని వైష్ణవి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.వైష్ణవి మృతదేహం పోస్ట్ మార్టం గదిలో నిర్జీవంగా పడిఉన్న సమయంలో ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. 'నా బిడ్డను చంపిన వాడిని ఉరితీయాలి... లేదంటే మాకు అప్పగించండి..' మీకు చేతకాకపోతే..మేమే చంపేస్తాం..'అంటూ వైష్ణవి కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

### కన్నీటి గాథగా మారిన వైష్ణవి జీవితం

చిరునవ్వులతో యూట్యూబ్‌లో గుర్తింపు తెచ్చుకున్న ఓ యువతి... ఒక్క రాత్రిలోనే విషాద గాథగా మారిపోవడం మాదాపూర్ గ్రామాన్ని విషాదంలో నింపేసింది. ప్రేమతో మొదలైన జీవితం.. అనుమానాలు, ఒత్తిళ్లు, కలహాలతో చివరకు రక్తకథగా ముగియడం... ప్రతి ఒక్కరి మనసులో భారంగా మిగిలిపోయింది.నిన్నటి వరకు సోషల్ మీడియాలో చిరునవ్వులతో కనిపించిన వైష్ణవి... ఈరోజు లేని నిజాన్ని ఆమె కుటుంబం, అభిమానులు అంగీకరించలేకపోతున్నారు. ఒక చిన్న మనస్పర్థ... ఒక క్షణికావేశం... రెండు ప్రాణాలను బలి తీసుకున్న ఈ ఘటన సమాజాన్ని ఆలోచింపజేస్తోంది. గర్భిణి అయిన భార్యను కాపాడాల్సిన భర్తే ప్రాణం తీసిన ఈ దారుణం, మానవ సంబంధాల విలువను ప్రశ్నిస్తోంది.!!



నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
బుధవారం
18 మార్చి 2026


# ఎస్సీ, ఎస్టీ హక్కుల కోసం చలో హైదరాబాద్



**నేటి సాక్షి గజ్వేల్:** ఎస్సీ, ఎస్టీల సంక్షేమం, అభివృద్ధి మరియు రక్షణలపై అసెంబ్లీలో చర్చ జరపాలని, బడ్జెట్ కేటాయింపులు మరియు ఖర్చులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నేడు హైదరాబాద్‌లో ధర్నా నిర్వహిస్తున్నట్లు డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి తెలిపారు. ఈ మేరకు మంగళవారం గజ్వేల్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ జిల్లా కార్యదర్శి బ్యాగరి వేణు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీలకు 18 శాతం బడ్జెట్ కేటాయించాలని, విద్యకు 20 శాతం బడ్జెట్ కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ బడ్జెట్ కేటాయింపులు, ఖర్చులపై పూర్తి వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. ఈ డిమాండ్ల సాధన కోసం నేడు ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించే ధర్నాకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రెండున్నర సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో ఎస్సీ, ఎస్టీల కోసం కొత్త పథకాలు అమలు కాలేదని ఆయన విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన చేవెళ్ల డిక్లరేషన్ అమలు కాలేదని అన్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన దళిత బంధు స్థానంలో అంబేద్కర్ అభయ హస్తం పథకం ప్రారంభిస్తామని ఇచ్చిన హామీ కూడా ఇప్పటివరకు అమలు కాలేదని పేర్కొన్నారు. ఎస్సీల జనాభా పెరుగుదలకు అనుగుణంగా 18 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని ఆయన అన్నారు. బడ్జెట్‌లో ఎస్సీ సంక్షేమానికి రూ.40,232 కోట్లను కేటాయించినట్లు ప్రకటించినప్పటికీ వాటిలో పదిశాతం కూడా ఖర్చు చేయలేదని ఆరోపించారు. విడుదల చేసిన రూ.16 వేల కోట్లలో సుమారు రూ.6 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని తెలిపారు. ఎస్టీలకు కేటాయించిన రూ.17,169 కోట్లలో సుమారు రూ.3 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని పేర్కొన్నారు. బడ్జెట్ కేటాయింపులు, ఖర్చులపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని, ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మైలారం మహేందర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి




- కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం
- వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన మహిళలు, ఉద్యోగులకు సన్మానం

**నేటి సాక్షి సిరిసిల్ల (శివకుమార్):** మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలు, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్స్ సంక్షేమ శాఖ ఆద్వర్యంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం వేడుకలు నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి.. కార్యక్రమాన్ని ప్రారంభించారు. వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన మహిళలు, ఉద్యోగులను సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. మహిళలు ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు. పోషకాహారం తీసుకోవాలని, వ్యాయామం, యోగా చేయాలని తెలిపారు. ప్రతి మహిళా కనీసం 20 మంది మహిళలకు మద్దతుగా నిలవాలని ఆకాంక్షించారు. తాము విధులు నిర్వర్తించే చోట, తమ పరిసర ప్రాంతాల వారికి ఆపద సమయములో భరోసా ఇవ్వాలని సూచించారు. మహిళలు డబ్బును పొదుపు చేయాలని వివరించారు. మహిళల ఆర్థిక అభివృద్ధితో తన కుటుంబం, దేశ వృద్ధి సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మిరాజం, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్య, డీఆర్డీఓ గీత, వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, మత్స్య శాఖ అధికారి సౌజన్య, వైద్యాధికారి రజిత, మైనార్టీ సంక్షేమ అధికారి భారతి, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి స్వప్న, డీవీహెచ్ఓ రవీందర్ రెడ్డి, పాల్గొన్నారు.

# శ్రీశైలం వెళ్ళే కన్నడ భక్తులకు మజ్జిగ పంపిణీ





**నేటి సాక్షి, ఆత్మకూరు:** ఉగాది పర్వదినం సందర్భంగా శ్రీశైలం కు పాదయాత్రగా వెళ్తున్న కన్నడ భక్తులకు సేవాభావంతో ముందుకొచ్చిన దేవా ట్రస్ట్ (అనంతపురం) వారు గోసాయి కట్ట ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఆది, సోమవారాల్లో కేవలం రెండు రోజుల్లోనే సుమారు 27 వేల మంది భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యుడు దేవ నరేష్ మాట్లాడుతూ, దాతల సహకారంతో దేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో తొలిసారిగా అటవీశాఖ అధికారుల అనుమతితో ఈ సేవ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. పాదయాత్ర ప్రారంభమైన తర్వాత వచ్చిన ఆలోచనతో, అవసరమైన అనుమతులు పొందుతూ తక్షణమే మజ్జిగ పంపిణీ చేపట్టినట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో మరింత ప్రణాళికాబద్ధంగా పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహించాలని, ముఖ్యంగా వచ్చే ఉగాది సందర్భంగా ఇంకా ఎక్కువ సంఖ్యలో భక్తులకు సేవలు అందించాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామని వెల్లడించారు. వేసవి కాలంలో తక్కువ సమయంలోనే ఈ సేవ కార్యక్రమం నిర్వహించడానికి సహకరించిన అటవీశాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవర నరేష్, భరత్, నాగరాజు, ప్రభాకర్, నరసింహ, లక్మన్,చెంచు బయన్న, తదితరులు పాల్గొన్నారు.

# రైతులు వాతావరణాన్ని తట్టుకునే పంటలను సాగు చేయాలి

## శాస్త్రవేత్త వి. శ్రీధర్



**నేటిసాక్షి, మిర్యాలగూడ:** రైతులు వాతావరణాన్ని తట్టుకునే విధంగా పంటలను సాగు చేయాలని కృషి విజ్ఞాన కేంద్రం కంపసాగర్ శాస్త్రవేత్త వి. శ్రీధర్ అన్నారు. మంగళవారం నియోజకవర్గ పరిధిలోని దామరచర్ల మండలంలోని రైతు వేదికలో "ఆత్మ-వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ" ఆధ్వర్యంలో సమగ్ర వ్యవసాయం, వాతావరణాన్ని తట్టుకునే వ్యవసాయ వ్యవస్థలు, మంచి వ్యవసాయ పద్ధతులను అవలంబించడం పై రైతులకు కృషి విజ్ఞాన కేంద్రం కంపసాగర్ శాస్త్రవేత్త వి. శ్రీధర్ శిక్షణ మరియు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రైతులు పంట సాగు మార్పిడి పద్ధతులు అవలంబించాలని, పంట సాగుతో పాటు పాడి, కోళ్ళు, చేపలు, తేనెటీగలు పెంపకం వంటి అనుబంధ రంగాల గురించి శిక్షణ ఇచ్చారు. ఇలా చేయడం వలన రైతులకు రసాయన ఎరువుల ఖర్చు తగ్గుతుందని, కుటుంబ సభ్యులకు ఉపాధి, ఒక దాని వ్యర్థం మరోక దానికి ఆహారం గా ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఇ.రూపేంద్రమణి, హార్టికల్చర్ ఆఫీసర్ నసీమ, ఆత్మ చైర్మన్ బ్రహ్మానంద రెడ్డి, మండల ఏటిఎం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గాజుల శ్రీనివాస్, పార్వతి, ప్రియాంక, రైతులు మల్లేష్, బాలు, నగేష్, ధనలక్ష్మి, బొల్లిగుంట తండ సర్పంచ్ మంగ, దామరచర్ల ఉపసర్పంచ్ ప్రియాంక, మరియు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వెల్గటూర్ పోలీస్ స్టేషన్ తనిఖీ

## రికార్డులు పరిశీలన, సిబ్బందికి సూచనలు



**నేటి సాక్షి, ఎండపల్లి:** పోలీస్ స్టేషన్ల తనిఖీల్లో భాగంగా ధర్మపురి సీఐ ఎ.రాం నర్సింహారెడ్డి మంగళవారం వెల్గటూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ తనిఖీలో స్టేషన్ పరిసరాలు, కేసులకు సంబంధించిన రికార్డుల నిర్వహణ విధానాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని, స్టేషన్ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పోలీస్ సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని, విధుల్లో క్రమశిక్షణ పాటిస్తూ ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఆదేశించారు. అనంతరం స్టేషన్‌లోని పోలీస్ సిబ్బందితో సమావేశమై వారి పనితీరును సమీక్షించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను త్వరగా స్వీకరించి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ప్రజలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ పోలీసులపై విశ్వాసం పెంచేలా సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వెల్గటూర్ ఎస్సై పి.ఉదయ్ కుమార్ తోపాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం

## వ్యక్తికి తీవ్ర గాయాలు ఆసుపత్రికి తరలింపు



**నేటి సాక్షి గన్నేరువరం, (బుర్ర అంజయ్య గౌడ్ ):** మండలంలోని గుండ్లపల్లి రాజీవ్ రహదారిపై మంగళవారం నాడు ఉదయం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది ఎస్ఐ జి నరేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం చీమలకుంటపల్లి గ్రామానికి చెందిన గాదె రాజు వయస్సు 42 సంవత్సరాలు ద్విచక్ర వాహనంపై బెజ్జంకి మండలం తోటపల్లి నుండి గన్నేరువరం మండలం గుండ్లపల్లి వైపు వెళ్తున్న క్రమంలో హైదరాబాదు నుండి కరీంనగర్ వైపు వెళ్తున్న హైదరాబాదుకు చెందిన కారు టీఎస్ 07 ఎఫ్ ఎక్స్ 9900 గల డ్రైవర్ పగుళ్ల పగుళ్ల పార్థీ వర్ష అతివేగంగా అజాగ్రత్తగా నడుపుతూ గాదే రాజు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టగా కిందపడి తలకు తీవ్ర గాయాలు అయ్యాయని స్థానికులు కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు ప్రస్తుతం రాజు చికిత్స తీసుకుంటున్నాడు రాజు భార్య గాదె హరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేందర్ రెడ్డి తెలిపారు

# తాళం వేసిన ఇంట్లో దొంగతనం

## ఆరు తులాల బంగారం అపహరణ






**నేటి సాక్షి గజ్వేల్ :** గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని సాయినాథ్ కాలనీలో తాళం వేసిన ఇంట్లో దొంగతనం జరిగింది. ఇంటి యజమాని మహేష్ యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి వెళ్లి దర్శనం ముగించుకుని సాయంత్రం ఐదు గంటల సమయంలో ఇంటికి చేరుకోగా తాళాలు పగులగొట్టబడి ఉండటం గమనించారు. ఇంట్లోకి వెళ్లి చూడగా వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉండగా, బీరువాలో భద్రపరచిన సుమారు ఆరు తులాల బంగారం దొంగిలించబడినట్లు గుర్తించారు. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని క్లూస్ టీమ్ సహాయంతో పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దొంగతనానికి పాల్పడిన వారిని త్వరలోనే పట్టుకుంటామని గజ్వేల్ సిఐ రవికుమార్ తెలిపారు.

# పరామర్శ



**నేటి సాక్షి, తిమ్మాపూర్:** తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి గ్రామానికి చెందిన గంగిపల్లి రాజయ్య ఇటీవలే అనారోగ్యంతో మృతిచెందగా, సర్పంచ్ పొన్నం సునీత అనిల్ గౌడ్ అతడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిత్రపటం వద్ద నివాళులర్పించి, ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షులు సానగొండ సమ్మయ్య, సానగొండ కనకయ్య, పోతుగంటి సంపత్, సానగొండ నరసింహాస్వామి, సానగొండ ఐలయ్య, అక్కపల్లి కొమురయ్య, అలువాల కనక రాజేశం, ఉప్పులేటి తిరుపతి, ఖమ్మం ఓదెలు, గంగిపల్లి అంజయ్య ఉన్నారు.



# మాల్దీవ్స్ టు నెట్స్

## ఐపీఎల్ కోసం రంగంలోకి ముంబై దిగ్గజం..!

**ముంబై:** పంతొమ్మిదో సీజన్ ఐపీఎల్ కోసం రోహిత్ శర్మ సిద్ధమవుతున్నాడు. రెండు రోజుల క్రితం కుటుంబంతో కలిసి మాల్దీవ్స్ లో వెకేషన్‌లో సరదాగా గడిపిన రోహిత్.. స్వదేశం వస్తూనే నేరుగా ముంబై స్క్వాడ్‌తో కలిశాడు. మంగళవారం సహచరులు, కోచ్ మహేల జయవర్ధనేతో కాసేపు ముచ్చటించిన హిట్‌మ్యాన్.. కిట్ బ్యాగ్‌తో మైదానంలోకి దిగాడు. నెట్స్‌లో బ్యాటింగ్, ఫీల్డింగ్.. ప్రాక్టీస్ చేసిన రోహిత్ ఐపీఎల్‌లో రఫ్ఫాడించాలనే కసితో ఉన్నాడు. ఐపీఎల్ దిగ్గజ కెప్టెన్లలో ఒకడైన రోహిత్ శర్మ మరో సీజన్‌కు రెడీ అవుతున్నాడు. గత సీజన్‌లో దంచేసిన హిట్‌మ్యాన్ (15 మ్యాచుల్లో 418 పరుగులు) ఈసారీ శుభారంభాలు ఇవ్వాలనే కసితో ఉన్నాడు. మంగళవారం ముంబై స్క్వాడ్‌తో కలిసిన రోహిత్ వెంటనే బ్యాటింగ్ ప్రాక్టీస్ మొదలెట్టాడు. శార్దూల్ ఠాకూర్, ఇతర ముంబై బౌలర్లను కాచుకున్న అతడు.. డిఫెన్స్, భారీ షాట్లు సాధన చేశాడు. అనంతరం సహచరులతో కలిసి ఫీల్డింగ్ చేశాడు. మొన్నటి వరకూ టీ20 ప్రపంచకకప్ అంబాసిడర్‌గా మైదానాల్లో సందడి చేసిన రోహిత్.. కాస్త బ్రేక్‌లో మాల్దీవ్స్‌లో కుటుంబంతో కలిసి సేదతీరాడు. ఐపీఎల్‌కు కౌంట్‌డౌన్ తన కెప్టెన్సీలో ముంబైని ఐదుసార్లు (2013, 2015, 2017, 2019, 2020) ముంబైని ఛాపియన్‌గా నిలిపిన రోహిత్.. గత రెండేళ్లుగా హార్దిక్ పాండ్యా సారథ్యంలో ఆడుతున్నాడు.



# ముంబై మహిళల టీ20 లీగ్‌కు వేళాయె

**ముంబై :** ముంబై క్రికెట్ అసోసియేషన్(ఎమ్‌సీఏ) మరో వినూత్న ఆలోచనతో ముందుకొచ్చింది. ఇప్పటికే పురుషుల టీ20 లీగ్ ద్వారా దేశ వ్యాప్తంగా దృష్టిని ఆకర్షించిన ఎమ్‌సీఏ తాజాగా తొలిసారి మహిళల లీగ్‌కు సిద్ధమైంది. దేశంలో మహిళల క్రికెట్‌కు పెరుగుతున్న ఆదరణను దృష్టిలో పెట్టుకుంటూ ఎమ్‌సీఏ అరంగేట్రం టీ20 లీగ్ ద్వారా ప్రతిభ కల్గిన ప్లేయర్లను వెలుగులోకి తీసుకొచ్చేందుకు సమాయత్తమైంది. ఇందులో భాగంగా సోమవారం రెండు టోర్నీలకు సంబంధించిన ట్రోఫీలను టీమ్‌ఇండియా స్టార్ క్రికెటర్ రోహిత్‌శర్మ ఆవిష్కరించాడు. ఈ కార్యక్రమంలో ముంబై క్రికెటర్ సయాలీ సత్ఘరెతో పాటు ఎమ్‌సీఏ అధ్యక్షుడు అజింక్యా నాయక్, అశిష్ షెలార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ 'క్రికెట్ అభివృద్ధి కోసం ఎమ్‌సీఏ చేస్తున్న కార్యక్రమాలపై సంతోషంగా ఉన్నాను. కేవలం ఐపీఎల్ ద్వారానే కాకుండా టీ20 ముంబై లీగ్ ద్వారా మరింత మంది యువ ప్లేయర్లకు అవకాశం కల్పిస్తున్నది. ముంబై టీ20 లీగ్‌లో ఆడిన ప్లేయర్లలో చాలా మంది ఐపీఎల్‌తో పాటు జాతీయ జట్టులో ప్రాతినిధ్యం వహిస్తున్నారు' అని అన్నాడు.







# మానసికంగా కుంగిపోయా!

- విజయాల కంటే పరాజయాలే ఎక్కువ
- వరల్డ్ కప్ నా చిన్ననాటి కల
- ఎన్నో సంవత్సరాలు కష్టపడ్డా
- సంజు భావోద్వేగ వ్యాఖ్యలు!

**ఢిల్లీ:** టీమిండియా స్టార్ క్రికెటర్ సంజు శాంసన్ తన కెరీర్, లక్ష్యాల గురించి భావోద్వేగ వ్యాఖ్యలు చేశాడు. భారత జట్టుకు వరల్డ్ కప్ గెలిపించడం తన చిన్ననాటి కల అని, దాన్ని నిజం చేసుకోవడానికి ఎన్నో సంవత్సరాలు కృషి చేశానని తెలిపాడు. వరల్డ్ కప్ లక్ష్యాన్ని సాధించాలనే కోరిక తన మనసులో ఎప్పుడూ ఉండేదని, దాన్ని ప్రతిరోజూ ఊహించుకుంటూ ధ్యానం చేసేవాడినని వెల్లడించాడు. తన క్రికెట్ ప్రయాణంలో ఎన్నో అడ్డంకులు, వైఫల్యాలు ఎదురయ్యాయని పేర్కొన్నాడు. కెరీర్‌లో విజయాల కంటే పరాజయాలే ఎక్కువ అని, ఓ సమయంలో మానసికంగా కుంగిపోయా అని సంజు చెప్పుకొచ్చాడు. తాజాగా సంజు శాంసన్ మాట్లాడుతూ... '2019లో ఐదు సంవత్సరాల గ్యాప్ తర్వాత తిరిగి జట్టులోకి వచ్చా. ఆ సమయంలో కెప్టెన్‌గా ఉన్న రోహిత్ శర్మ నాతో మాట్లాడాడు. జట్టులోకి వచ్చాక నీ లక్ష్యం ఏంటి? అని అడిగాడు. నేను ఎలాంటి సందేహం లేకుండా భారత్‌కు వరల్డ్ కప్ అందించడమే నా టార్గెట్ అని చెప్పా. అప్పటి నుంచి 2026 వరకూ అదే లక్ష్యంతో కృషి చేశా. నా ప్రయాణంలో ఎన్నో అడ్డంకులు, వైఫల్యాలు ఎదురయ్యాయి. చిన్నప్పటి నుంచి ఎన్నోసార్లు కిందికి పడిపోయా. విజయాల కంటే పరాజయాలే ఎక్కువగా చూశా. అందుకే వైఫల్యాలను ఎలా ఎదుర్కోవాలో నాకు బాగా తెలుసు. అదే నా బలం'అని వివరించాడు. 'వరల్డ్ కప్ 2026 ముందు గడ్డు పరిస్థితులు ఎదుర్కొన్నా. న్యూజిలాండ్‌తో జరిగిన సిరీస్‌లో విఫలమయ్యా. ఆ సమయంలో నేను మానసికంగా కుంగిపోయా. కానీ నాలుగు ఐదు రోజుల్లోనే తిరిగి లేచి నిలబడగలిగా. నాలో ఉన్న పట్టుదలే మళ్లీ విజయాల దిశగా నడిపించింది. చివరకు భారత జట్టుకు వరల్డ్ కప్ గెలిపించాలనే కల నెరవేరింది. నా జీవితంలో చివరి శ్వాస వరకు ఇది గుర్తుంటుంది' అని సంజు శాంసన్ భావోద్వేగంగా వెల్లడించాడు. 2026 టీ20 ప్రపంచ కప్‌లో ఆడిన 5 మ్యాచుల్లో 3 హాఫ్ సెంచరీలు చేసి.. 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా సంజు నిలిచాడు.

# టీ20ల్లో అమేలియా కొత్త చరిత్ర

## అత్యంత వేగంగా వెయ్యి పరుగులు, వంద వికెట్లతో రికార్డు..!

**ఢిల్లీ:** అంతర్జాతీయ క్రికెట్‌లో న్యూజిలాండ్ క్రికెటర్ అమేలియా కేర్ చరిత్ర సృష్టించింది. స్వదేశంలో దక్షిణాఫ్రికాతో జరుగుతున్న ద్వైపాక్షిక సిరీస్‌లో చెలరేగిపోతున్న కివీస్ కెప్టెన్ రెండో టీ20 మ్యాచ్‌లో వందో వికెట్ సాధించింది. తద్వారా టీ20ల్లో ఆమె అరుదైన మైలురాయిని అధిగమించింది. పొట్టి ఫార్మాట్‌లో అత్యంత వేగంగా వెయ్యికి పైగా పరుగులు బాదేసి, వందకు పైగా వికెట్లు తీసిన మహిళా క్రికెటర్‌గా అమేలియా అవతరించింది. ఈ ఆల్‌రౌండర్ 94వ ఇన్నింగ్స్‌లోనే ఈ ఫీట్ సొంతం చేసుకుంది. తద్వారా ఈ ఫార్మాట్‌లో అత్యంత వేగంగా వెయ్యికి పైగా పరుగులు, వందకు పైగా వికెట్లతో చరిత్ర లిఖించిందీ డాషింగ్ బ్యాటర్. మొత్తంగా.. తమ దేశం నుంచి ఈ ఘనత సాధించిన మూడో క్రికెటర్ తనే. ఆమె కంటే ముందు సోఫీ డెవినె, మిచెల్ శాంట్నర్ ఈ మార్క్ అందుకున్నారు.

### క్యారీ చాన్.. 74 ఇన్నింగ్స్‌ల్లోనే

ఓవరాల్‌గా చూస్తే.. అసోసియేట్ నేషన్స్ క్రికెటర్ క్యారీ చాన్ 74 ఇన్నింగ్స్‌ల్లోనే ఈ మైలురాయిని దాటింది. పురుషుల క్రికెట్‌లో బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ షకీబుల్ హసన్ అగ్రస్థానంలో ఉన్నాడు. ఈ వెటరన్ ఆటగాడు 84 ఇన్నింగ్స్‌ల్లో వెయ్యికి పైగా రన్స్, వందకు పైగా వికెట్లు సాధించాడు. మహిళా క్రికెటర్ల పరంగా చూసుకుంటే... దీప్తి శర్మ (భారత్), నిదా దార్(పాకిస్థాన్), ఎలీసా పెర్రీ(ఆస్ట్రేలియా), సోఫీ డెవినె(న్యూజిలాండ్), హీలీ మాథ్యూస్(వెస్టిండీస్)లు ఈ క్లబ్‌లో ఉన్నారు.



# ఆస్పత్రిపై దాడి యుద్ధ నేరమే: రషీద్ ఖాన్






**బాగ్దాద్:** ఆఫ్ఘనిస్తాన్‌లో ఓ డ్రగ్స్ చికిత్సాలయంపై సోమవారం రాత్రి పాకిస్థాన్ ఆకస్మిక దాడి చేసింది. ఆ దాడి వల్ల కాబూల్‌లోని ఆస్పత్రిలో 400 మంది మృతిచెందగా, మరో 250 మంది గాయపడ్డారు. డ్రగ్ రిహాబిలిటేషన్ ఆస్పత్రిపై రాత్రి 9 గంటలకు దాడి జరిగినట్లు ఆఫ్ఘన్ ప్రభుత్వ ప్రతినిధి హమ్‌దుల్లా ఫిత్రత్ తెలిపారు. అయితే ఈ ఘటన పట్ల ఆఫ్ఘన్ క్రికెటర్ రహీద్ ఖాన్ స్పందించారు. పాక్ మిలిటరీ చర్యను ఆయన ఖండించారు. పాకిస్థాన్ వైమానిక దాడుల వల్లే ప్రాణనష్టం జరిగినట్లు ఆ క్రికెటర్ చెప్పారు. పవిత్రమైన రంజాన్ మాసం సమయంలో ఈ దాడి జరగడం దారుణమన్నారు. తన ఎక్స్ అకౌంట్‌లో రషీద్ ఖాన్ రియాక్ట్ అయ్యారు.

సాధారణ పౌరులు చనిపోవడం బాధగా ఉన్నట్లు చెప్పారు. ఇండ్లను, విద్యా సంస్థలను, వైద్య కేంద్రాలను కావాలని లేదా అనుకోకుండా అటాక్ చేసినా అది యుద్ధ నేరమే అవుతుందని రషీద్ పేర్కొన్నారు. రంజాన్ పవిత్ర మాసం వేళ మనుషుల ప్రాణాలు విలువ ఇవ్వకుండా వ్యవహరిస్తున్న తీరు తీవ్రంగా కలచివేస్తున్నట్లు చెప్పారు. దీని వల్ల వైరం, ద్వేషం పెరుగుతుందన్నారు. ఐక్యరాజ్యసమితి, ఇతర మానవ హక్కుల సంఘాలు ఈ ఘటన పట్ల దర్యాప్తు చేపట్టాలని కోరారు. నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి కష్ట సమయంలో ఆఫ్ఘన్ ప్రజలకు అండగా ఉండనున్నట్లు చెప్పారు.




# వివాదంలో సర్కే చునర్ తేరీ సాంగ్

కన్నడ నటుడు ధ్రువ సర్జా కథానాయకుడిగా ప్రేమ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న పాన్-ఇండియా చిత్రం 'ఐఆ: ది డెవిల్' భారీ వివాదంలో చిక్కుకున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలోని 'సర్కే చునర్ తేరి సర్కే' అనే స్పెషల్ సాంగ్ అశ్లీలంగా ఉందంటూ సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ పాటపై నిషేధం విధించాలని కోరుతూ ముంబైకి చెందిన ప్రముఖ న్యాయవాది వినీత్ జిందాల్ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్‌తో పాటు సమాచార ప్రసార మంత్రిత్వ శాఖకు ఫిర్యాదు చేశాడు. ఈ పాటలోని సాహిత్యం మరియు దృశ్యాలు అత్యంత అశ్లీలంగా, అసభ్యకరంగా ఉన్నాయని, ముఖ్యంగా మైనర్లకు హాని కలిగించే విధంగా ఉన్నాయని జిందాల్ తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. యూట్యూబ్ మరియు ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో విచ్చలవిడిగా ప్రచారంలో ఉన్న ఈ పాట, పబ్లిక్ డెన్సీని దెబ్బతీసేలా ఉందని ఆరోపించారు. ఈ పాటలో ఉపయోగించిన పదజాలం మరియు నృత్య రీతులు రెచ్చగొట్టేలా ఉన్నాయని, ఇది సమాజంలో అసభ్యతను ప్రోత్సహిస్తుందని జిందాల్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పాటకు సాహిత్యం రాసిన రాకీబ్ ఆలం, దర్శకుడు ప్రేమ్, సంగీత దర్శకుడు అర్జున్ జన్య మరియు గాయని మంగ్లీ వంటి వారిని కూడా ఈ ఫిర్యాదులో ప్రస్తావించాడు. ఇప్పటికే ఈ అంశంపై ఢిల్లీ పోలీస్ సైబర్ సెల్‌లో కూడా విడిగా క్రిమినల్ ఫిర్యాదు నమోదైందని, పిల్లల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అన్ని డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల నుండి ఈ పాటను వెంటనే తొలగించాలని ఆయన అధికారులను డిమాండ్ చేశారు.






# వ్యక్తిగత జీవితీలపై కెమెరాల కన్ను

## ముంబై నుంచి చెన్నైకి పాకిన జాడ్యం

## విజయ్, త్రిషల వ్యవహారంపై ఖుష్బూ

విజయ్, త్రిషల గురించి కొన్ని రోజులుగా వస్తోన్న వార్తలపై నటి ఖుష్బూ మరోమారు స్పందించారు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో త్రిష గురించి మాట్లాడుతూ.. ఆమె చాలా హుందాగా ఉంటుందన్నారు. తెలియని వారు చేసే కామెంట్స్ గురించి ఆలోచించాల్సిన అవసరం లేదన్నారు. 'ప్రస్తుతం మనం ఎలాంటి రోజుల్లో ఉన్నామంటే.. ఎవరైనా తుమ్మినా వాళ్లను నిందించేస్తున్నాం. ఇది చాలా దురదృష్టకరం. నాకు విజయ్, త్రిష ఇద్దరూ బాగా తెలుసు. ముఖ్యంగా త్రిష నాకు చాలా సన్నిహితురాలు. నాకు తెలిసిన గొప్ప మహిళల్లో తను ఒకరు. ఎంతో మృదుస్వభావి అని చెప్పారు. ఇక రూమర్స్ సృష్టించేవారు, ఫొటో గ్రాఫర్లను ఉద్దేశించి ఖుష్బూ మాట్లాడుతూ.. ఈ ఫొటోగ్రాఫర్లు ప్రతిచోటా సెలబ్రిటీల వెనకపడటం అనేది ముంబయిలో చూస్తుంటాం. ఇప్పుడు ఆ సంస్కృతి చెన్నైలో కూడా మొదలవడం బాధాకరం. ఎదుటివారి వ్యక్తిగత జీవితాల గురించి కామెంట్స్ చేసేవారు.. తమ సమస్యల కంటే ఇతరుల జీవితాల్లో ఏం జరుగుతుందో తెలుసుకోవడానికే ఇష్టపడతారు. ఒకరి గురించి తప్పుగా మాట్లాడుతూ వారు ఒక రకమైన పైశాచిక ఆనందాన్ని పొందుతుంటారు. ఇలాంటి కామెంట్స్ చేసేవారిలో 99.9 శాతం మంది ఎవరో కూడా మనకు తెలియదు. అలాంటివారు చేసే వ్యాఖ్యలకు స్పందిస్తూ మన విలువైన సమయాన్ని వృథా చేసుకోవాల్సిన అవసరం లేదని నేను భావిస్తున్నాను అని ఖుష్బూ అన్నారు. ఇటీవల కూడా ఖుష్బూ వీరిద్దరి గురించి మాట్లాడారు. 'ఈ వ్యవహారంతో ప్రజలకు ఏం సంబంధం ఉందో నాకు అర్థంకావట్లేదు. అది వారి వ్యక్తిగతం. దీనిని ఎందుకు పెద్ద విషయంలా చూస్తున్నారు?' అని పేర్కొన్నారు.

# గాడ్ ఫాదర్ దర్శకుడితో పవన్ మూవీ అంటూ ప్రచారం



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎంగా తన రాజకీయ బాధ్యతలను నిర్వర్తిస్తూనే, మరోవైపు సినిమాలను కూడా పూర్తి చేసే పనిలో ఉన్నారు. ఈ క్రమంలో సోషల్ మీడియాలో ఆయన కొత్త ప్రాజెక్టుల గురించి ఏదో ఒక వార్త హల్చల్ చేస్తూనే ఉంది. తాజాగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మాణంలో దర్శకుడు మోహన్ రాజా, పవన్ కళ్యాణ్ కాంబినేషన్‌లో ఒక భారీ సినిమా రాబోతుందంటూ వినిపించిన వార్తలు సినీ వర్గాల్లో హాట్ టాపిక్ అయ్యాయి. పవర్ స్టార్‌తో సినిమా గురించి ఎలాంటి ప్రతిపాదనలు లేవని స్పష్టమైంది. పవన్ నెక్ట్స్ లైనప్‌లో ఉన్న సినిమాల్లో ఓజీ సీక్వెల్ లేదా ప్రీక్వెల్‌తో పాటు హరిహర వీరమల్లు పార్ట్ 2 కూడా ఉంది. అలాగే.. సురేందర్ రెడ్డితో ఓ సినిమా చేయ-ంబోతున్నారు. నెక్ట్స్ పవన్ నుంచి ఇమ్మీడియేట్‌గా సెట్స్ పైకి వెళ్లనున్న సినిమా సురేందర్ రెడ్డిదే. ఓజీ, వీరమల్లు సీక్వెల్స్ ఎప్పుడు ఉంటాయనే విషయంలో మాత్రం క్లారిటీ లేదు. ప్రస్తుతానికైతే.. పవన్ కళ్యాణ్ నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం విడుదలకు సిద్ధంగా ఉంది.

# చిరంజీవితో తప్పకుండా ఓ సినిమా చేస్తా

## ఉస్తాద్ ప్రమోషన్‌లో హరీష్ శంకర్



ఈ ఉగాదికి 'ఉస్తాద్ భగత్ సింగ్'తో పవన్ కల్యాణ్ అభిమానుల్లో జోష్ నింపనున్నారు దర్శకుడు హరీశ్ శంకర్. పవన్ హీరోగా ఆయన తెరకెక్కించిన ఈ సినిమా 19న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో వరుస ఇంటర్వ్యూలతో బిజీగా ఉన్నారు హరీశ్. తాజాగా ఆయన చిరంజీవి గురించి మట్లాడారు. ఈ ట్రైలర్ చూసి చిరంజీవి నాతో 20 నిమిషాలు మాట్లాడారు. డైలాగులు బాగున్నాయన్నారు. పవన్ చాలా అందంగా ఉన్నారని ఆనందంగా చెప్పారు. ఆ ఫోన్ పెట్టేశాక నాకు ఓ విషయం అర్థమైంది. చిరంజీవికి పవన్ కల్యాణ్ తమ్ముడు మాత్రమే కాదు.. కొడుకు కూడా అనిపించింది. ప్రతి షాట్ గురించి చెబుతూ ఆయన మురిసిపోయారు. నేను చిరంజీవిని చాలాసార్లు కలిశాను. ఆయనతో కొన్ని యాడ్ ఫిల్మ్‌లు తీశాను. ఆయనతో నా సినిమా ప్రాసెస్‌లో ఉంది. కచ్చితంగా మెగాస్టార్‌తో ఒక 'రౌడీ అల్లుడు', 'దొంగ మొగుడు', 'గ్యాంగ్ లీడర్' లాంటి సినిమా చేసి తీరతాను' అని హరీశ్ చెప్పారు. పవన్‌కల్యాణ్ గొప్ప వ్యక్తి. 16 ఏళ్ల కుర్రాడిగా ఉన్నప్పటినుంచే సమాజం గురించి ఆలోచించేవారు. అందుకే ప్రతి విషయం పైనా స్పందిస్తారు. రాజకీయాల్లోకి వచ్చారు కాబట్టి జాతీయ సమైక్యత, సనాతన ధర్మం గురించి మాట్లాడుతున్నారని అందరూ అనుకుంటారు. కానీ, ఆయన ఖుషిలో 'యే మేరా జహాన్..' బద్రిలో 'ఐయామ్ యాన్ ఇండియన్' బాలులో 'ఇంతే ఇంతింతే సాంగ్' ఆ తర్వాత 'గుడుంబా శంకర్'లో 'లేలే లేలే ఇవ్వాళే లేలే..' ఇలా ప్రతి సినిమాలోని పాటల్లో ఆయన ఏదోఒక సందేశం ఇస్తూనే ఉన్నారు. పవన్ గురించి ఒక్క మాటలో చెప్పాలంటే.. శ్రీశ్రీ పద్యానికి ప్యాంట్ షర్ట్ వేసి స్వాగ్ అనే ఒక ఆయువు పోస్తే అదే పవన్‌కల్యాణ్. అవతల వ్యక్తిని గౌరవించే పద్ధతి, ఒక మాట ఇస్తే దానిపై నిలబడేతత్వం. సినిమాలో సహజంగా కనిపించడం కోసం ఆయన పడే కష్టం అన్ని ఆయన గొప్పతనానికి నిదర్శనం. చిన్న డైలాగ్ కోసం కూడా రిహార్సల్స్ చేస్తారు. టైం తీసుకొని బాగా వచ్చేవరకూ ప్రాక్టీస్ చేస్తూనే ఉంటారు అని ప్రశంసించారు.



# ప్రభాస్ .. ఫౌజీ దసరాకు పక్కా


## శరవేగంగా సాగుతున్న షూటింగ్

ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్న రెబల్ స్టార్ ప్రభాస్ .. బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బాక్సాఫీస్ వద్ద సునామీ సృష్టించేందుకు సిద్ధమవుతున్నాడు. అందులో హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న హిస్టారికల్ వార్ డ్రామా 'ఫౌజీ' పై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాను ఈ ఏడాది దసరాకు రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నారు మేకర్స్. అయితే, అనుకున్న సమయానికి షూటింగ్ ఫినిష్ అవడం కష్టమని, ఫలితంగా పోస్ట్‌పోన్ అయ్యే ఛాన్స్ ఉందనే వార్తలు వినిపిస్తున్నాయి. కానీ ఏది ఏమైనా సరే ఈ చిత్రాన్నివిజయదశమి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ గట్టిగా ఫిక్స్ అయ్యారట. దసరా సీజన్ టాలీవుడ్‌లో అతిపెద్ద సినిమాలకు కలిసొచ్చే సమయం కావడంతో, ఆ లోపే పోస్ట్ ప్రొడక్షన్ పనులను కూడా పూర్తి చేయాలనే పట్టుదలతో ఉన్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. దర్శకుడు హను రాఘవపూడి విజన్‌పై పూర్తి నమ్మకంతో ఉన్న మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ, ఆయనకు పూర్తిగా 'ఫ్రీ హ్యాండ్' ఇచ్చినట్లు తెలుస్తోంది. టెక్నికల్ వాల్యూస్ విషయంలో ఎక్కడా రాజీ పడకుండా, అనుకున్న సమయానికి అవుట్‌పుట్ తీసుకురావడమే లక్ష్యంగా టీమ్ పనిచేస్తోంది. అన్నీ అనుకున్నట్టుగా జరిగితే.. ఈ ఏడాది జూలై లేదా ఆగస్టు లోపు షూటింగ్ మొత్తం పూర్తి చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రంతో ఇమాన్వీ హీరోయిన్‌గా టాలీవుడ్‌కి పరిచయం అవుతోంది. మొత్తంగా.. ఈ సినిమాతో ప్రభాస్ మరోసారి పాన్ ఇండియా లెవల్లో సెన్సేషన్ క్రియేట్ చేయడం ఖాయంగా కనిపిస్తోంది.

Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 9666052221**

# నేటి సాక్షి కథనంపై కలెక్టర్ స్పందన

- నేటి సాక్షి కథనానికి స్పందించిన జిల్లా కలెక్టర్
- చరవాణి ద్వారా మండల అధికారులకు హెచ్చరికలు జారీ
- కార్యదర్శుల పనితీరుపై ఆగ్రహం
- విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు


అడిగేదెవరు.. ఆపేదెవరు

**నేటి సాక్షి కోదాడ (అనంతగిరి):** నేటి సాక్షి దినపత్రిక కథనానికి జిల్లా కలెక్టర్ స్పందించారు.మంగళవారం "అడిగేదేవరు ఆపేదెవరు... సమయపాలన పాటించని కార్యదర్శులు" అనే కథనాన్ని నేటి సాక్షి దినపత్రిక ప్రచురించింది కాగా జిల్లా కలెక్టర్ స్పందించారు. అనంతగిరి ఎంపీడీవోకు చరావణి ద్వారా సంప్రదించి ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ప్రజా పాలన 99 రోజులు ప్రగతి ప్రణాళికలో జిల్లావ్యాప్తంగా కట్టుదిట్టమైన ఏర్పాట్ల నేపథ్యంలో గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తుంటే మండల కార్యదర్శులు నిర్లక్ష్యం ఎందుకు వహిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. సమయపాలన పాటించని వారిపై చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు తెలుస్తుంది. కలెక్టర్ ఆదేశాలతో మండల అధికారులు సదురు కార్యదర్శులను జూమ్ మీటింగ్ ద్వారా హెచ్చరించి విదుల పట్ల కార్యదర్శులు వ్యవహరిస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం 8 నుండి సాయత్రం 5 గంటల వరకు విధుల్లో ఉండాలని నిర్లక్ష్యం వహిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యదర్శులు పనితీరుపై నేటి సాక్షి కథనాన్ని పలువురు అభినందించారు. అదేవిధంగా ఉపాధిహామీ పనుల్లో జ్యాప్యం జరుగుతుందని దానిపై వివరణ ఇవ్వాలని అడిగినట్లు సమాచారం

# ప్రముఖ నాయకుడి కుటుంబంలో విషాదం

- జాతీయ ఎస్టీ కమీషన్ సభ్యుడి తండ్రి మృతి నివాళులర్పించిన డోర్నకల్ యువనేత రవిచంద్ర



**నేటి సాక్షి , మహబూబాబాద్ :** గూడూర్ మండలం మాచర్ల గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. జాతీయ ఎస్టీ కమీషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ గారి తండ్రి జాటోత్ లచ్చా నాయక్ గారు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు తీవ్ర దుఃఖంలో మునిగిపోయారు. గ్రామంలో ఒక్కసారిగా విషాద వాతావరణం నెలకొని, పెద్ద సంఖ్యలో ప్రజలు చేరుకుని తమ నివాళులు అర్పించారు. లచ్చా నాయక్ గారు గ్రామంలో మంచి పేరు గడించిన వ్యక్తిగా, అందరితో కలిసిమెలిసి ఉండే స్వభావంతో ప్రసిద్ధి చెందారు. ఆయన మరణం గ్రామ ప్రజలకు తీరని లోటుగా మారిందని పలువురు అభిప్రాయపడ్డారు. ఆయన కుటుంబం సామాజికంగా సేవా కార్యక్రమాల్లో ముందుండేది కావడంతో, స్థానికంగా మంచి గౌరవం పొందింది. ఈ విషాద వార్త తెలిసిన వెంటనే డోర్నకల్ యువనేత డి ఎస్ రవిచంద్ర గారు మాచర్ల గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, ఈ కష్టకాలంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

అంతేకాకుండా, పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు కూడా మాచర్లకు చేరుకుని లచ్చా నాయక్ గారి పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ ఘటనతో మాచర్ల గ్రామం మొత్తం విషాదంలో మునిగిపోయింది. కుటుంబ సభ్యుల రోదనలు హృదయ విదారకంగా మారాయి. గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున హాజరై, లచ్చా నాయక్ గారికి చివరి వీడ్కోలు పలికారు.

# అక్రమ ఇసుక మాఫియాపై భారీ దాడి

- 12 ట్రాక్టర్లు పట్టుబడ్డా కేసులు ఎన్ని?
- అధికారులపై ప్రజల అనుమానాలు గరిష్టానికి!
- చట్టం అందరికీ సమానమా? లేక కొందరికి మినహాయింపా?




**నేటి సాక్షి, మహబూబాబాద్ :** మహబూబాబాద్ జిల్లా నరసింహులపేట మండలం రామన్నగూడెం శివారులో అక్రమ ఇసుక రవాణా వ్యవహారం సంచలనంగా మారింది. అనుమతులు లేకుండా ఆకేరు వాగు నుండి పెద్దఎత్తున ఇసుకను తరలిస్తున్న 12 ట్రాక్టర్లను పోలీసులు పట్టుకోవడం ఒక్కసారిగా మండలంలో చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ ఘటనతో అసలు ప్రశ్నలు ఇప్పుడే మొదలయ్యాయి. పట్టుబడిన ట్రాక్టర్లన్నింటిపైనా కేసులు నమోదు చేస్తారా? లేక కొందరిని మాత్రమే టార్గెట్ చేసి మిగతావారిని వదిలేస్తారా? అనే సందేహాలు ప్రజల్లో గట్టిగా వినిపిస్తున్నాయి. గ్రామాల్లో, ముఖ్యంగా చౌరస్తాలు, టీ దుకాణాలు, రైతు బజార్ల వద్ద ప్రజలు గుంపులుగా చర్చలు జరుపుతున్నారు. "పోలీసులు 12 ట్రాక్టర్లు పట్టుకున్నారు... కానీ కేసులు ఎన్ని నమోదు అవుతాయి?" అనే ప్రశ్న ప్రతి ఒక్కరి నోట వినిపిస్తోంది. "ఎవరిపై చర్యలు తీసుకుంటారు? ఎవరు తప్పించుకుంటారు?" అనే అనుమానాలు కూడా పెరుగుతున్నాయి. ఈ వ్యవహారంలో రాజకీయ ఒత్తిడులు, ప్రభావాలు ఉంటాయా అనే కోణంలో కూడా ప్రజలు చర్చించుకుంటున్నారు. మండల ప్రజలు స్పష్టంగా ఒకే డిమాండ్ చేస్తున్నారు – చట్టం అందరికీ సమానంగా అమలు కావాలి. పట్టుబడిన ప్రతి ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసి, అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఎలాంటి సిఫార్సులు, ఒత్తిడులు, రాజకీయం లేకుండా న్యాయం జరగాలని ప్రజలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే రెవెన్యూ మరియు మైనింగ్ అధికారుల పనితీరుపై కూడా తీవ్రమైన విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇంత పెద్ద స్థాయిలో అక్రమ ఇసుక తవ్వకం జరుగుతుంటే ఇప్పటి వరకు అధికారులు ఎక్కడ ఉన్నారు? ఎందుకు ముందుగానే చర్యలు తీసుకోలేదు? అనే ప్రశ్నలు ప్రజల నుంచి ఉధృతంగా వస్తున్నాయి. ఈ అక్రమ వ్యాపారం ఒక్కరోజులో ఏర్పడినది కాదని, దీని వెనుక పెద్ద నెట్వర్క్ ఉండే అవకాశం ఉందని కూడా స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు ఇంకా ఒక ముఖ్యమైన అంశాన్ని ప్రస్తావిస్తున్నారు. "ఇలాంటి అక్రమాలు చిన్నచిన్న వ్యక్తుల వల్ల మాత్రమే కాదు... కొంతమంది పెద్దల ప్రోత్సాహంతో జరుగుతున్నాయి" అనే అనుమానం కూడా వ్యక్తమవుతోంది. దీంతో ఈ వ్యవహారంలో లోతైన దర్యాప్తు జరగాలని ప్రజలు కోరుతున్నారు. ట్రాక్టర్లు పట్టుకోవడం మాత్రమే కాదు, దీనికి మూల కారణాలను బయటపెట్టాలని వారు అంటున్నారు. ఈ ఘటన ఇప్పుడు సాధారణ పోలీస్ కేసు కాదని స్పష్టమవుతోంది. ఇది అధికారుల నిష్పక్షపాతంపై, ప్రభుత్వ వ్యవస్థపై ప్రజల నమ్మకంపై ఒక పెద్ద పరీక్షగా మారింది. నిజంగా చట్టం అందరికీ సమానంగా అమలవుతుందా? లేక కొందరికి ప్రత్యేక రక్షణ ఉంటుందా? అనే ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సిన సమయం వచ్చింది. మండల ప్రజల గళం ఇప్పుడు ఒక్కటే – "పట్టుకున్న ప్రతి ట్రాక్టర్‌పై కేసు నమోదు చేయాలి!" "అక్రమ ఇసుక మాఫియాను పూర్తిగా అణచివేయాలి!" ఇప్పుడు అందరి చూపు అధికారులపై ఉంది వారు నిజంగా కఠిన చర్యలు తీసుకుంటారా? లేక ఈ వ్యవహారం కూడా మామూలుగా ముగిసిపోతుందా? అన్నది చూడాలి.

# డ్రైవర్ నరేష్ మృతి బాధాకరం



**నేటి సాక్షి అనంతగిరి:** సూర్యాపేట జిల్లా అనంతగిరి మండల పరిధిలోని అమీనాబాద్ గ్రామంలో మంగళవారం అనారోగ్యంతో గొల్ల నరేష్.(40) మృతి చెందారు. బిఎస్ఎన్ఎల్ టాక్సి స్టాండ్ వర్కర్స్ యూనియన్ ఉప సర్పంచ్.. కుక్కల వీరబాబు ఇతర డ్రైవర్లతో కలిసి మృతుని స్వగృహానికి వెళ్లి, ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ఆర్థిక సాయంగా 10000 ఇచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించి, నరేష్ ఆకస్మిక మరణం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

# సిసి రోడ్డుకు భూమి పూజ

**టిడిపి మండల ప్రధాన కార్యదర్శి జి.హరిప్రసాద్ యాదవ్.**



**నేటి సాక్షి, పాములపాడు:** పాములపాడు మండలంలోని, మిట్టకందాల గ్రామ దండుపేటలో సిసి రోడ్డుకు తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి జి.హరి ప్రసాద్ యాదవ్ నాయకులతో కలిసి భూమి పూజ చేసి, పనులను ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా మిట్టకందాల గ్రామ మాజీ సర్పంచ్, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి జి. హరిప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలోనే గ్రామాలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతాయన్నారు. నంద్యాల పార్లమెంట్ టిడిపి ఇన్చార్జ్ మాండ్ర. శివానందరెడ్డి, ఎమ్మెల్యే గిత్త. జయసూర్యల సహకారంతో దాదాపు 45లక్షల వ్యయంతో, 7 సీసీ. రోడ్లను వేయడం జరుగుతుందన్నారు. గ్రామాభివృద్ధిలో అందరితో కలిసి పనిచేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి బూత్ కన్వీనర్ ఎల్. శివరాముడు, నాయకులు ఎల్. సురేష్, సాంబ, పెద్ద యాకోబు, పైల్వాన్, మౌలాలి, దేవరాజు, తదితరులు పాల్గొనడం జరిగింది.

# ఈద్-ఉల్-ఫితర్ శుభ్రత

**ఆసిఫాబాద్ మునిసిపాలిటీ ప్రత్యేక చర్యలు**



**నేటి సాక్షి,కొమరంభీమ్ ఆసిఫాబాద్:** ఆసిఫాబాద్ మునిసిపాలిటీ పరిధిలో ఈద్–ఉల్–ఫితర్ పండుగను పురస్కరించుకొని ఈద్గా మరియు పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక శుభ్రత కార్యక్రమాలు చేపట్టబడుతున్నాయి. పండుగ సందర్భంగా ప్రార్థనలు ప్రశాంతంగా, పరిశుభ్రమైన వాతావరణంలో నిర్వహించేందుకు మునిసిపల్ సిబ్బంది వేగవంతంగా పనులు కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా మాజీ డిసిసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ రావు మునిసిపల్ సిబ్బందికి శుభ్రత కార్యక్రమాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాలేశ్వర్ గౌడ్, మునిసిపల్ వార్డ్ కౌన్సిలర్లు కృష్ణమ్మ, రాపర్తి కార్తీక్, రాజంపేట గ్రామపంచాయతీ వార్డు సభ్యుడు గులాం జావిద్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ అసాద్, నూర్ నగర్ కాంగ్రెస్ నాయకుడు జమీర్ అహ్మద్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని ఏర్పాట్లను పరిశీలించారు. పరిశుభ్రమైన వాతావరణంలో ఈద్ ప్రార్థనలు నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

# తీవ్ర అనారోగ్యంతో

## చికిత్స పొందుతున్న విద్యార్థిని



**నేటి సాక్షి, నారాయణపేట,(ఇమామ్ సబ్ ):** నారాయణపేట జిల్లాలోని జాజాపూర్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న అనురాధ అనే అమ్మాయి గత చాలా రోజులుగా అనారోగ్యంతో హైదరాబాదులో చికిత్స పొందుతున్నది. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని ఉపాధ్యాయ బృందం అప్పంపల్లి లో ఉన్న అమ్మాయి ఇంటికి వెళ్లి అన్ని రకాలుగా ధైర్యం చెప్పి చికిత్స కోసం రూ,18 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి పాఠశాల ఉపాధ్యాయ బృందం ప్రతాప్ భానుప్రకాష్ లక్ష్మణ్, నరసింహ,రఘురాం, రెడ్డి, మంగళ, శశిరేఖ, నిర్మల, శ్రీదేవి, శిరీష, శ్రీ సాయి కృష్ణ, మాణిక్యప్ప, వెంకటేష్, నితిన్ రెడ్డి పాల్గొన్నారు.

# ఆశా వర్కర్ల గర్జన

## రూ. 26,000 వేతనం ఇవ్వాల్సిందే




**నేటి సాక్షి సిరిసిల్ల (శివకుమార్):** సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద ఆశా వర్కర్లు కనీసం 26000. ప్రకటించాలని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ప్రమాద బీమా 50 లక్షలు ఇవ్వాలని. పెండింగ్ జీతాలు వెంటనే అందించాలని. లెప్రసీ సర్వే. రద్దు చేయాలని తదితర డిమాండ్లతో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్లు అతి తక్కువ వేతనంతో 24 గంటలు పని చేయడం జరుగుతుంది వారికి సంబంధం లేని పని కూడా ప్రభుత్వం చేయించుకుంటూ శ్రమ దోపిడీకి గురిచేస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఆశాలకు 18 అమలు చేస్తామని ప్రభుత్వ ఉద్యోగులుగా నియమిస్తామని హామీ ఇవ్వడం జరిగింది కానీ ఇంతవరకు హామీలు అమలు చేయకుండా పని భారం మాత్రం. విపరీతంగా పెంచుతుంది . అధికారుల వేధింపులు రోజురోజుకు పెరిగిపోతున్నాయి లెప్రసీ సర్వే వలన ఆశలు అనారోగ్యానికి గురవుతున్నారు. టీబి పేషెంట్ ను కుటుంబ సభ్యులు ముట్టుకోవడానికి సంకోచిస్తారు అలాంటిది వారి తెమడ. తీసుకోవచ్చు పరీక్ష చేయించాలి పరీక్ష చేయించకుంటే ఉద్యోగం నుండి తొలగిస్తాను బెదిరింపులకు పాల్పడతారు. ప్రభుత్వానికి సంబంధించిన అన్ని రకాల పనులు ఆశాలతో చేయించుకుంటుంది గాని వారి సమస్యలను పరిష్కరించడానికి ముందుకు రావడం లేదు ఈ బడ్జెట్ సమావేశంలో ఆశాల డిమాండ్ పరిష్కరించని ఎడల నిరవధికా సమ్మెకు వెళ్లడానికి కూడా ఆశాల సిద్ధంగా ఉన్నారని అన్నారు . ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు.

# కొడిమ్యాలలో పులి కలకలం



## వరుస దాడులతో గ్రామస్తుల్లో భయం

**నేటి సాక్షి, కొడిమ్యాల :** జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం సూరంపేట గంగారం తండా పరిసర ప్రాంతాల్లో పెద్దపులి సంచారం స్థానికులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తోంది. గత రెండు రోజులుగా పులి పశువులపై వరుస దాడులు జరుపుతుండటంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముందు రోజే ఒక లేగదూడను పులి చంపినట్లు స్థానికులు తెలిపారు. ఆ ఘటనలో బాధితుడికి అటవీ శాఖ అధికారులు తక్షణ సహాయంగా రూ. 5,000 అందజేశారు. తదుపరి రోజు గంగారం తండాలోని సేవలాల్ గుడి సమీపంలో తేజావత్ గోరి అనే రైతుకు చెందిన సుడి ఆవుపై పులి దాడి చేసి చంపేసింది. ఈ ఘటనలను సీసీ కెమెరా ఫుటేజ్ ఆధారంగా అటవీ అధికారులు నిర్ధారించారు. పులిని పట్టుకునేందుకు అధికారులు అప్రమత్తమయ్యారు. పులి మళ్లీ అదే ప్రాంతానికి వచ్చే అవకాశముందని భావించి మృత పశువు పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. గంగారం తండా అటవీ ప్రాంతాల్లో సంచరిస్తున్న ఈ పులిని అధికారులు "జె-వన్-1"గా గుర్తించారు. మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ అభయారణ్యం నుండి వలస వచ్చిన ఈ పులి, కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల మీదుగా జగిత్యాల జిల్లాకు చేరుకున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో అటవీ శాఖ అధికారులు ప్రజలకు పలు సూచనలు జారీ చేశారు. అటవీ ప్రాంతాలకు లేదా పొలాలకు ఒంటరిగా వెళ్లవద్దని, కనీసం 5 నుంచి 10 మంది గుంపులుగా వెళ్లాలని సూచించారు. ఉదయం 8 గంటల తర్వాత మాత్రమే పొలాలకు వెళ్లి, సాయంత్రం 5 గంటలలోపే తిరిగి రావాలని తెలిపారు. పశువుల కాపరులు కూడా గుంపులుగా మాత్రమే అడవికి వెళ్లాలని హెచ్చరించారు. పొలాల చుట్టూ విద్యుత్ కంచెలు ఏర్పాటు చేయడం చట్టవిరుద్ధమని, దీని వల్ల పులికి హాని కలిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పులి దాడిలో పశువులను కోల్పోయిన రైతులకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందజేస్తుందని హామీ ఇచ్చారు. పులి కదలికలను నిరంతరం పర్యవేక్షించేందుకు అటవీ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు జిల్లా

# ధన్వాడ తాసిల్దార్ కార్యాలయం ముందు బిజెపి ధర్నా

**నేటి సాక్షి, నారాయణపేట, (ఇమామ్‌సాబ్):** నారాయణపేట జిల్లాలోని ధన్వాడ మండలంలో బీజేపీ శాఖ ఆధ్వర్యంలోలి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలుపై ధన్వాడ ఎమ్మార్వో ఆఫీస్ ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. మండల అధ్యక్షుడు శివరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గోవర్ధన్ గౌడ్, పంది రామచంద్రయ్య, మాకం సురేందర్, మల్లయ్య మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు ఇప్పటికీ పూర్తిగా అమలు కావడం లేదని తెలిపారు. చాలా మంది అర్హులైన ప్రజలకు పథకాల లబ్ధి అందడం లేదని, గ్రామాల్లో ప్రజలు ఇంకా సమస్యలు ఎదుర్కొంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆరు గ్యారెంటీలను నిజంగా ప్రజలకు అందేలా చూడాలని, పారదర్శకంగా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. లేకపోతే మరింత పెద్ద స్థాయిలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎర్రప్ప విజయ్ కుమార్, కథలప్ప వెంకటేష్ గౌడ్, రాఘవేందర్ గౌడ్ తదితర బీజేపీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.



# ప్రకృతి వ్యవసాయ సాగుతో మరింత ఆరోగ్యం



- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**నేటి సాక్షి,మంచిర్యాల జిల్లా:** ప్రకృతి వ్యవసాయ సాగుతో ప్రజల జీవన ప్రమాణాన్ని మరింత పెంపొందించవచ్చని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాలలో జాతీయ మిషన్ ఫర్ ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన ఒక రోజు శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి మొదటి ప్రాధాన్యత అందించి రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ సాగులో సహజ సిద్ధమైన సేంద్రియ ఎరువులు, సాగు పద్ధతులు అవలంబించడం ద్వారా ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులు సాధించవచ్చని, తద్వారా ప్రజలకు మరింత ఆరోగ్యవంతమైన ఆహార ఉత్పత్తులను అందించవచ్చని తెలిపారు. రైతులకు ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని, పంట సాగులో రైతులకు అవసరమైన మెలకువలను అందించి అధిక దిగుబడి సాధించేలా ప్రోత్సహిస్తుందని తెలిపారు. 10 సంవత్సరాల పాటు ప్రకృతి వ్యవసాయ సాగు చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని హాజీపూర్ మండలం గుడిపేట రైతు వేదిక నుండి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖ, ప్రకృతి వ్యవసాయ రైతు కొట్టే రవీందర్, అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 15 రైతువేదికలలో 1 వేయి 875 మందితో వీడియో కాన్ఫరెన్స్ మీటింగ్ నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పథకం పురోగతి దిశగా జిల్లాలో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అనంతరం రైతులకు ప్రకృతి వ్యవసాయ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఆత్మ చైర్మన్ సింగతి మురళీ, కార్పొరేటర్లు రాజన్న, బియ్యాల త్రివేణి, కమల, లగిశెట్టి రాజయ్య, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


# గజ్వేల్‌లో దోమల ముప్పు తీవ్రం.. మున్సిపల్ పై విమర్శలు

**నేటి సాక్షి గజ్వేల్ :** గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో మున్సిపల్ శాఖ అధికారుల నిర్లక్ష్యం రోజురోజుకూ బయటపడుతోంది. పట్టణంలోని పలు వార్డుల్లో శానిటేషన్ వ్యవస్థ పూర్తిగా స్తంభించి, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా సాయంత్రం 5:30 తర్వాత దోమలు విపరీతంగా పెరిగి, ఒక్క వ్యక్తిపై వందల సంఖ్యలో దోమలు దాడి చేస్తున్న పరిస్థితి నెలకొంది. పట్టణంలో ఎక్కడ చూసినా మురికి కాలువలు, నిల్వ నీరు, చెత్త పేరుకుపోవడం వంటి సమస్యలు తీవ్రరూపం దాల్చాయి. మున్సిపల్ అధికారులు ఇప్పటివరకు దోమల నివారణకు ఫాగింగ్ కార్యక్రమాలు నిర్వహించకపోవడం, మందులు పిచికారీ చేయకపోవడం పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా చెత్త బుట్టల కొరతతో ప్రజలు చెత్తను ఎక్కడపడితే అక్కడ పారవేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో దోమల సంఖ్య పెరిగి, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల ముప్పు పెరుగుతోంది. ప్రజలు ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ మున్సిపల్ అధికారుల స్పందన కోసం ఎదురుచూస్తున్నారు. ప్రత్యేకంగా ఫస్ట్ వార్డులో మర్రిచెట్టు సమీపంలో మురికి నీరు నిల్వ ఉండి, వర్షాలు పడినప్పుడు ఆ నీరు ఇళ్లలోకి చేరుతున్నట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితి కారణంగా అక్కడి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని వారు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ జన సమితి పార్టీ జిల్లా కన్వీనర్ నీరుడి స్వామి మున్సిపల్ అధికారుల



నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ఖండించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అన్ని వార్డుల్లో ఫాగింగ్ కార్యక్రమాలు చేపట్టాలని, దోమల నివారణ మందులు పిచికారీ చేయాలని, మురికి కాలువలను శుభ్రం చేయాలని, చెత్త బుట్టలు అందుబాటులో ఉంచాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే ఫస్ట్ వార్డు సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని కోరారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోకపోతే ప్రజల ఆగ్రహం మరింత పెరిగే అవకాశం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

# గజ్వేల్‌లో బీజేపీ ధర్నా



- 'కాంగ్రెస్ హామీలు అమలు చేయాలి

**నేటి సాక్షి గజ్వేల్:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నాయకులు గజ్వేల్ ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ ఆందోళన జరిగింది. ఈ కార్యక్రమంలో గజ్వేల్ పట్టణ శాఖ అధ్యక్షుడు మనోహర్ యాదవ్, మండల శాఖ అధ్యక్షుడు పంజాల అశోక్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, అయితే వాటిని అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ముఖ్యంగా నిరుపేదలకు ఇంటి స్థలం మరియు రూ. 5 లక్షల ఆర్థిక సాయం, రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ, గృహ జ్యోతి పథకం ద్వారా ఉచిత విద్యుత్తు, రూ. 4500 పెన్షన్, కళ్యాణ లక్ష్మి పథకంలో తులం బంగారం వంటి హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని, రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ఇచ్చిన మాటలు నిలబెట్టుకోవాలని బీజేపీ నేతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నేత ఎల్లు రామిరెడ్డి, కౌన్సిలర్ శ్రీనివాస్, బిజెపి నేతలు, క్యాడి క్యాలా రాములు, శశిధర్ రెడ్డి, నాయని సందీప్, బారు అరవింద్ ల తోపాటు నేతలు పాల్గొన్నారు.

# మదాసి కురువలకు ఇచ్చిన మాట తప్పిన మంత్రి వాకిటి శ్రీహరి

- 1268 జీవో అమలుపై అసెంబ్లీలో ప్రస్తావించాలి
- లేనియెడల రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతాం కురువ నవీన్ హెచ్చరిక



**నేటి సాక్షి, నారాయణపేట:** మదాసి కురువలకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి విస్మరించారని మదాసి కురువ సంఘం ధన్వాడ మండల ప్రచార కార్యదర్శి కురువ నవీన్ మండిపడ్డారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంత్రి తీరుపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.

**రెండేళ్లు గడిచినా అందని న్యాయం:**

గత అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మక్తల్ బహిరంగ సభలో మంత్రి శ్రీహరి మాట్లాడుతూ.. తాను గెలిచిన వెంటనే 1268 జీవోను అమలు పరిచి, మదాసి కురువలకు ఎస్సీ సర్టిఫికేట్లు వచ్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని స్పష్టమైన హామీ ఇచ్చారని నవీన్ గుర్తు చేశారు. కానీ, అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్లు గడుస్తున్నా, ఒక్క అసెంబ్లీ సమావేశంలో కూడా ఈ అంశాన్ని ప్రస్తావించకపోవడం గమనార్హమన్నారు. జిల్లా నాయకులు ఎన్నిసార్లు కలిసినా మంత్రి వాయిదాలు వేస్తూ వస్తున్నారని ఆయన ఆరోపించారు.

**75 ఏళ్ల సుదీర్ఘ అన్యాయం:**

"గత 75 ఏళ్లుగా రాజ్యాంగ ఫలాలు అందక మదాసి కురువలు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనైనా మా సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, మాకు న్యాయం చేయాలి" అని నవీన్ డిమాండ్ చేశారు.

**ఎన్నికల బహిష్కరణ హెచ్చరిక:**

మంత్రి తన వాగ్దానాన్ని నిలబెట్టుకోని పక్షంలో, రాబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మదాసి మదారి కురువలు తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు. తమ కులస్తుల శక్తి ఏంటో ఓటు ద్వారా చూపిస్తామని స్పష్టం చేశారు.

# పోలీస్ సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

- గజ్వేల్ జిల్లా ఆస్పత్రిలో విస్తృత రక్త పరీక్షలు



**నేటి సాక్షి గజ్వేల్:** పోలీస్ శాఖ సిబ్బంది ఆరోగ్య పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని గజ్వేల్ జిల్లా ఆస్పత్రిలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందికి 16 రకాల రక్త పరీక్షలను వైద్యులు నిర్వహించి వారి ఆరోగ్య పరిస్థితిని సమగ్రంగా పరిశీలించారు. ఈ వైద్య శిబిరంలో ఏసీబీ నరసింహ, సీఐ రవికుమార్, ట్రాఫిక్ సీఐ మురళి, ఎస్సైలు మరియు ఇతర సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. మొత్తం 45 మంది పోలీస్ సిబ్బందికి రక్త పరీక్షలు నిర్వహించగా, ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిస్థితిపై ప్రత్యేకంగా వైద్యులు దృష్టి సారించారు. జిల్లా ఆస్పత్రి ఆర్ఎంఓ రాము మరియు డాక్టర్ శ్రీధర్ పర్యవేక్షణలో ఈ పరీక్షలు సక్రమంగా జరిగాయి. శిబిరంలో ల్యాబ్ టెక్నీషియన్లు దొడ్డి రమేష్, జీవన, రచన, శీను తదితరులు పాల్గొని రక్త నమూనాలను సేకరించి, పరీక్షలను వేగవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ, పోలీస్ సిబ్బంది నిరంతరం ఒత్తిడితో కూడిన విధుల్లో ఉండడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. కాబట్టి తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధులను ముందుగానే గుర్తించి నివారించవచ్చని సూచించారు. పోలీస్ సిబ్బంది కూడా ఈ కార్యక్రమాన్ని స్వాగతిస్తూ, ఇలాంటి ఆరోగ్య శిబిరాలు తరచూ నిర్వహిస్తే తమకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆస్పత్రి సిబ్బంది సమన్వయంతో ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# నారాయణపేట విద్యాభివృద్ధికి కృషి చేద్దాం

- పేట జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.....



**నేటి సాక్షి, నారాయణపేట,(ఇమామ్‌సాబ్):** నారాయణపేట జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ గారిని వారి కార్యాలయంలో పి ఆర్టియు టిఎస్ నారాయణపేట జిల్లా బృందం మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను నోటు పుస్తకాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పిఆర్టియు నాయకులతో మాట్లాడుతూ నారాయణపేట జిల్లాలో పాఠశాలలు చాలా చక్కగా పనిచేస్తున్నాయని రికార్డు ఉంది దానిని అలాగే కొనసాగిస్తూ జిల్లాలో విద్యాభివృద్ధికి అందరం కలిసి పనిచేద్దామని అన్నారు. ఉపాధ్యాయులకు సంబంధించిన ఏమైనా సమస్యలు ఉంటే అందరూ ఎప్పుడైనా కలవచ్చు అని, వారికి పరిష్కారం చేద్దామన్నారు. ముఖ్యంగా వేసవి ప్రారంభమైనందున పాఠశాలలో పరిశుభ్రమైన తాగునీరు, పరిశుభ్రమైన మధ్యాహ్న భోజనము మరియు మూత్రశాల నిర్వహణ ఉండే విధంగా చూడాలని వారు అన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మరియు ప్రధాన కార్యదర్శి జనార్ధన్ రెడ్డి వెంకట్ రెడ్డి గారు మాట్లాడుతూ జిల్లాలో జిల్లా పరిషత్ లో పనిచేయుచున్న ఉపాధ్యాయుల అకాల మరణం వలన వారి కుటుంబాలు చాలా ఇబ్బందులు పడుతున్నాయని వారికి ఆధారపడి ఉన్న వారిని కారుణ్య నియమాకాలలో నియమించాలని కోరడం జరిగింది. పరిశీలించడం జరుగుతుందని వారన్నారు ఈ కార్యక్రమంలో నారాయణపేట మండల అధ్యక్షులు ఎం రఘువీర్ దామరగిద్ద మండల అధ్యక్ష కార్యదర్శులు సత్యనారాయణరెడ్డి రమేష్ జిల్లా సైన్స్ అధికారి భాను ప్రకాష్ టిఆర్టి సీనియర్ నాయకులు శ్రీనివాస్ మహేష్ శేఖర్ రెడ్డి వెంకటేష్ బాలాజీ రవికుమార్ వెంకట్ రాములు విమాన్స్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు నిర్వహించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య



**నేటి సాక్షి ,మంచిర్యాల జిల్లా:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజులకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. మంగళవారం జిల్లాలోని కాసిపేట మండలం దేవాపూర్ గ్రామపంచాయతీని సందర్శించి నర్సరీ, పారిశుధ్యం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, ప్రతి రోజు ప్రతి ఇంటి నుండి తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించి డంపింగ్ యార్డ్ కు తరలించాలని తెలిపారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం, శుద్ధమైన త్రాగునీరు అందించాలని తెలిపారు. గ్రామంలోని మార్కెట్ ప్రాంతాన్ని సందర్శించి పరిశుభ్రత నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను సందర్శించి త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఓటరు జాబితా మ్యాపింగ్ ప్రక్రియలో భాగంగా బూత్ స్థాయి అధికారులకు పలు సూచనలు చేసి మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. గ్రామంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు కొరకు స్థలాన్ని పరిశీలించి ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీల హాజరు పట్టికను పరిశీలించారు. ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.

## జర్నలిస్ట్ నరేష్ మృతి బాధాకరం



**నేటి సాక్షి అనంతగిరి:** మండల పరిధిలోని అమీనాబాద్ గ్రామానికి చెందిన అనంతగిరి మండల ప్రజా జ్యోతి విలేకరి గొళ్ళ నరేష్ (40) తెల్లవారు జామున మృతి చెందారు.దీర్ఘకాలంగా విలేకరిగా పనిచేస్తున్న ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు.అతని ఆరోగ్య పరిస్థితి విషమించడంతో బుధవారం ఉదయం సుమారు5 గంటలకు మృతి చెందినట్లు ఆయన కుటుంబీకులు తెలిపారు.విషయం తెలుసుకున్న వివిధ పార్టీలకు చెందిన నాయకులతో పాటు పలువురు రిపోర్టర్లు నరేష్ మృత దేహానికి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన నరేష్ పేదల సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి ఎంతగానో కృషి చేశారన్నారు.బుదవారం మధ్యాహ్నం అమీనాబాద్ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

## రంజాన్ పండుగ తోఫా పంపిణీ



**నేటి సాక్షి నారాయణపేట,(ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లాలోని మరికల్,ధన్వాడ మండలాల్లోని వివిధ గ్రామాలలో రంజాన్ పండుగను పురస్కరించుకొని తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో ఉన్న ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ పురస్కరించుకొని మంగళవారం నాడు తోఫా ద్వారా బట్టల పంపిణీ కార్యక్రమాన్ని చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో మరికల్ మండల తాసిల్దార్ రామకోటి, ధన్వాడ మండల తాసిల్దార్ సింధుజ, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఎస్ సూర్య మోహన్ రెడ్డి, చిట్టెం మాధవరెడ్డి, ధన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నరహరి,మండల ఆర్ ఐ సుధాకర్ రెడ్డి, మరికల్ గ్రామ సర్పంచ్ చెన్నయ్య, వీరన్న, మరికల్ యూత్ అధ్యక్షుడు కాటికొండ ఆంజనేయులు, మరికల్ పట్టణ అధ్యక్షులు హరీష్ కుమార్, రాఘవేంద్ర, రామకృష్ణారెడ్డి, గోవర్ధన్, రామకృష్ణ, బొంత మొగులయ్య, ఎల్ రాములు నాగరాజు, కొండ్రంపల్లి గ్రామ సర్పంచ్ సుధాకర్, మండల నాయకులు సుదర్శన్ రెడ్డి, వార్డు సభ్యులు మొగలయ్య జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలి

**బీజేపీ జిల్లా కార్యదర్శి లింగంపెల్లి శ్రీనివాసరావు**



**నేటిసాక్షి,ములుగు ప్రతినిధి :** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని భారతీయ జనతా పార్టీ ములుగు జిల్లా కార్యదర్శి లింగంపెల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేసారు మంగళవారం మండల కేంద్రంలో మీడియాతో శ్రీనివాసరావు మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, అయితే వాటిని అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ముఖ్యంగా విద్యార్థులకు యువ వికాసం నిరుపేదలకు ఇంటి స్థలం 5 లక్షల రూపాయల ఆర్థిక సాయం రైతులకు 2 లక్షల రుణమాఫీ, గృహ జ్యోతి పథకం ద్వారా ఉచిత విద్యుత్తు 4500 పెన్షన్, కళ్యాణ లక్ష్మి పథకంలో తులం బంగారం వంటి హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ఇచ్చిన మాటలు నిలబెట్టుకోవాలని బీజేపీ జిల్లా కార్యదర్శి లింగంపెల్లి శ్రీనివాసరావు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు

## ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలం

**ఎం వెంకటేష్ బాబు**



**నేటి సాక్షి అనంతగిరి:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ సూర్యాపేట జిల్లా ఉపాధ్యక్షులు మల్లెబోయిన వెంకటేష్ బాబు ఆధ్వర్యంలో మంగళవారం తహశీల్దార్ హిమబిందుకు మెమోరాండం సమర్పించారు. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు జిల్లా ఉపాధ్యక్షులు మల్లెబోయిన వెంకటేష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. గ్యారెంటీలను త్వరగా అమలు చేయకపోతే భవిష్యత్తులో మరింత తీవ్ర ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చింతకుంట్ల సతీష్, వంగవీటి శ్రీనివాసరావు, యడ్లపల్లి వెంకట నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..



# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి

- గృహ ప్రవేశానికి సిద్ధం చేయాలి
- కలెక్టర్ గరిమ అగ్రవాల్
- మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, ఏఈ పీఆర్, హౌసింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా షమిక్ష



**నేటి సాక్షి సిరిసిల్ల (శివకుమార్):** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లాలో ఇందిరమ్మ ఇండ్లు, గ్రామ సమాఖ్య, గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్వాడీ కేంద్రాలు, టాయిలెట్ల నిర్మాణాలపై జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, ఏఈ పీఆర్, హౌసింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు త్వరితగతిన ఇళ్లు పూర్తి చేసుకునేలా సహకారం అందించాలని సూచించారు. తుది దశలో ఉన్న ఇండ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేసి ఈ నెల ఆఖరున మెగా గృహ ప్రవేశ కార్యక్రమానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. మండల స్థాయి అధికారులు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేయాలని, వారి సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. వడ్రంగి, ప్లంబర్, మేస్త్రి ఇతర ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ప్రభుత్వం సూచించిన బడ్జెట్ లోనే ఇండ్లు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలోని రెండు మున్సిపాలిటీలు, ఆయా మండలాల్లో గుడిసె ల్లో ఉంటున్న వారి వివరాలు సేకరించాలని, వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని ఆదేశించారు. హౌసింగ్, మున్సిపల్ అధికారులు ఇండ్ల నిర్మాణాల ఫోటోలు ఎప్పటికప్పుడు ఆన్లైన్ లో అప్లోడ్ చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ విషయమై జడ్పీ డిప్యూటీ సీఈవో, హౌసింగ్. ఇతర అధికారులను కలెక్టర్ అభినంది

## గ్యాస్ సిలిండర్ తనిఖీ

**తాహసిల్దార్ గ్యాస్ గోడౌన్**



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి :** స్థానిక చౌడేపల్లి శబరిష్ గ్యాస్ ఏజెన్సీ యొక్క కార్యాలయం గోడౌన్లను తహసిల్దార్ పార్వతి తనిఖీ చేశారు. పశ్చిమ ఆసియాలో యుద్ధం నేపథ్యంలో గ్యాస్ కొరత ఉందన్న అపోహలు నేపథ్యంలో తాసిల్దార్ పార్వతి తనిఖీ చేశారు ,గ్యాస్ కొరత లేదని బుక్ చేసుకున్న వారికి అందరికీ చేరుతుందని ఈ సందర్భంగా ఆమె అన్నారు. ప్రభుత్వం ఎక్కడ గ్యాస్ కొరత లేకుండా చూస్తుందని ఏజెన్సీ వారు గ్యాస్ వినియోగదారులకు అధిక ధరలకు విక్రయించకుండా సకాలంలో అందించాలని సూచించారు ,ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా కార్యక్రమాలు జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు, అనంతరం గోడౌన్ లోని గ్యాస్ సిలిండర్లను అదేవిధంగా రికార్డులను తనిఖీ చేశారు, ఈ కార్యక్రమంలో శబరీష్ గ్యాస్ ఏజెన్సీస్ ప్రొప్రైటర్ విజయలాపురం మోహన్ బాబు రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు,

## మేడారంలో బ్యాంకు ఏర్పాటు చేయాలి

- టీడీపీ ములుగు నియోజకవర్గం ఇంచార్జి దారావత్ దేవా నాయక్ డిమాండ్



**నేటిసాక్షి, ములుగు ప్రతినిధి:** ములుగు జిల్లా తాడ్వాయి మండలం సమ్మక్క సారక్క గ్రామమైన మేడారంలో ఏదైనా ప్రభుత్వ బ్యాంకు బ్రాంచ్ ఏర్పాటు చేయాలి అని టీడీపీ నియోజకవర్గం ఇంచార్జ్ దారావత్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు మంగళవారం మేడారంలో టీడీపీ నియోజకవర్గం ఇంచార్జ్ దారావత్ దేవా నాయక్ మాట్లాడుతూ బ్యాంకు మేడారం ప్రాంతంలో ఏర్పాటు చేసినట్లు అయితే మేడారం చుట్టు ప్రక్కల ఉన్నటువంటి 18 గ్రామాలలోని ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది అని ఇప్పుడు బయక్కపేట, కాల్వపల్లి నార్లపూర్ వెంగ్లాపూర్ గోనేపల్లి వాళ్ళు గోవిందరాపేటకు సుమారుగా 30 కిలోమీటర్లు దూరం వెళ్తున్నారు అని కన్నెపల్లి, కొత్తూరు ఊరట్టం, మేడారం వాళ్ళు తాడ్వాయి పోవడానికి చాలా ఇబ్బందిగా ఉంది అని మేడారం ప్రాంతం ప్రత్యేక మండలంగా ఏర్పాటు అయితే ఎలాగో బ్యాంకు వస్తుంది కానీ ప్రజల లో అసంతృప్తి రాకముందే బ్యాంకు ఏర్పాటు చేయాలి అని, బ్యాంకు ఏర్పాటు కోసం త్వరలో ములుగు కలెక్టర్ కి తెలంగాణ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ కి వినతి పత్రం ఇస్తాం అన్నారు మేడారంలో బ్యాంకు ఏర్పాటు చేయాలి అని వివిధ రాజకీయ పార్టీల నాయకులు మహిళాలు యువత ప్రతి ఒక్కరు స్పందించి ప్రశ్నించి బ్యాంకు సాధించుకోవాలి అని విజ్ఞప్తి చేశారు.

## గంగమ్మ దేవస్థానం నందున వేలంపాట



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి:** శక్తి క్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో నిర్వహించిన వేలంపాట ద్వారా రూ 24,10,000లు ఆదాయంగా సమకూరిందని ఈవో ఉప కమిషనర్ ఏకాంబరం తెలిపారు, మంగళవారం కొండపై 5 వనరులకు గాను నిర్వహించిన వేలంపాటలో అమ్మవారి ఆలయం ముందు పెద్ద భోగము మొక్కుబడి రుసుము నిర్వహించుకును ,హక్కును సోమశేఖర్ హెచ్చుగా పడి పాటను దక్కించుకున్నట్లు ఆయన వివరించారు, తక్కిన నాలుగు వనరులు సరైన వేలంపాట రానందున వాయిదా వేసినట్లు ఆయన పేర్కొన్నారు, ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్స్పెక్టర్ శశి కుమార్ ఆలయ అధికార ఆర్చక సిబ్బంది పాల్గొన్నారు,

## ప్రాణాలు పణంగా పెట్టి సేవ చేస్తున్నాం

**మమ్మల్ని గుర్తించరా సానిటేషన్ కార్మికుల ఆవేదన**



**నేటి సాక్షి సిరిసిల్ల (శివకుమార్):** సిరిసిల్ల జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే సానిటేషన్ సెక్యూరిటీ గార్డ్స్ ప్రభుత్వం వెంటనే కనీస వేతనం 26,000 అందించాలని హైదరాబాదులో జరుగుతున్న ధర్నా కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్లడం జరిగింది

ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే నాయకులు శ్రీరామ్ సదానందం గారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసేటువంటి సానిటేషన్ కార్మికులు రోగులకు తన ప్రాణాలు ప్రాణంగా పెట్టి సేవలందిస్తున్నారు ప్రభుత్వం వారి సేవలను గుర్తించడం లేదు 11వేల వేతనం తోటి కుటుంబాలు గడవక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు ఆస్పత్రిలో 200 కొడుకులకు సరిపోయే కార్మికులు లేక కార్మికులపై విపరీతమైన పని భారం పెరుగుతుంది ప్రభుత్వం ఇచ్చే 15000 నుండి మా వద్ద నుండి పీఎఫ్ డబ్బులు కట్ చేసుకుని చేతికి 11,000 మాత్రమే కాంట్రాక్టర్ అందించడం జరుగుతుంది. ఈ సమస్యలు పరిష్కరించాలని కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాదు వైద్యాధికారి కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం చేయడం జరుగుతుంది ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి వేతనాలు పెంచి పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు లేనిపక్షంలో సమ్మెకు వెళ్లడానికి కార్మికులు సిద్ధంగా ఉన్నారని అన్నారు ఈ కార్యక్రమంలో లతా నాగమణి, విజయ్, లలిత, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## ఈద్గా వద్ద ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

- మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ అహ్మద్ పరిశీలన



**నేటి సాక్షి, కొమురం భీం ఆసిఫాబాద్:** ఆసిఫాబాద్ పట్టణంలో ముస్లింల పవిత్ర పండుగ ఈద్-ఉల్-ఫితర్ (రంజాన్)ను పురస్కరించుకుని ఈద్గా మైదానం వద్ద మున్సిపల్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ పనులను మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్, మున్సిపల్ కమిషనర్ గజానంద్, కౌన్సిలర్ సాలం బీన్ అహ్మద్ కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఈద్గా పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని సిబ్బందితో కలిసి తొలగింపజేశారు. రంజాన్ పండుగ నమాజ్‌కు హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని వసతులు కల్పిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ తెలిపారు. ముఖ్యంగా మంచినీటి సదుపాయం, పరిసరాల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ అధికారులకు, సిబ్బందికి సూచించారు. పండుగ నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి ఈద్గా మైదానాన్ని సిద్ధం చేస్తామని మున్సిపల్ యంత్రాంగం పేర్కొంది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకలో పాల్గొన్న మాజీ జెడ్పీటిసి కుందారపు జలంధర్

**నేటి సాక్షి-మేడిపల్లి:** మేడిపల్లి మండల కేంద్రం లోని స్థానిక పిఎన్ఆర్ గార్డెన్ లో పాలెపు



ప్రభుదాస్– రూతమ్మ ల కుమారుడు పాలెపు రోబిన్ –రోషిని ల వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులని అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి చేపూరి నాగరాజు, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు ధోనిపాల శంకర్, క్యాతం రాజేశ్వర్ రెడ్డి,పాస్టర్ బెంజిమెన్, పెటోరి రాజశేఖర్, పాలెపు సురేష్, పాలెపు రమేష్, కుందారపు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కోరుట్ల అంగన్వాడీ టీచర్‌కు జాతీయ స్థాయి పురస్కారం

- సాయిశ్వరీకి 'ఉమెన్ లీడర్‌షిప్ నేషనల్ అవార్డు - 2026' ప్రదానం
- తిరుపతిలో ఘనంగా బహుజన సాహిత్య అకాడమీ 18వ జాతీయ సదస్సు



**నేటి సాక్షి,కోరుట్ల, (రాధారపు నర్సయ్య):** సాహిత్యం మరియు సామాజిక సేవా రంగాల్లో విశేష కృషి చేసిన కోరుట్లకు చెందిన అంగన్వాడీ టీచర్ మేకల సాయిశ్వరీకి జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. బహుజన సాహిత్య అకాడమీ (దీూా) ఆధ్వర్యంలో ఇచ్చే ప్రతిష్ఠాత్మక 'ఉమెన్ లీడర్‌షిప్ నేషనల్ అవార్డు - 2026' ఆమెను వరించింది. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో మార్చి 15న నిర్వహించిన సౌత్ ఇండియా బహుజన రైటర్స్ 18వ జాతీయ సదస్సులో ఈ పురస్కారాన్ని అందజేశారు. అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ, జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ యు. సుబ్రమనియన్ చేతుల మీదుగా సాయిశ్వరీ ఈ అవార్డును, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. అంగన్వాడీ టీచర్‌గా తన విధులను నిర్వర్తిస్తూనే, సామాజిక బాధ్యతతో సాహిత్యంపై ఆమె చూపుతున్న మక్కువను ఈ సందర్భంగా ప్రముఖులు కొనియాడారు. ఈ సందర్భంగా అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల సాహిత్యాన్ని, వారి సామాజిక చైతన్యాన్ని ప్రోత్సహించడమే తమ అకాడమీ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. సమాజ మార్పు కోసం కృషి చేసే రచయితలు, సంఘసేవకులను గుర్తించి గౌరవించడం ఇతరులకు ప్రేరణగా నిలుస్తుందని పేర్కొన్నారు.

దక్షిణ భారత దేశంలోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల నుంచి సుమారు 600 మంది ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరయ్యారు. సాహిత్యం మరియు సామాజిక అంశాలపై ఈ సదస్సులో విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో సౌత్ ఇండియా జనరల్ సెక్రటరీ జి. విష్ణువర్ధన్, కమిటీ సభ్యులు తాటికంటి ఐలయ్య, బాదె వెంకటేశం తదితరులు పాల్గొన్నారు. కోరుట్ల వాసికి జాతీయ స్థాయి అవార్డు రావడం పట్ల పట్టణ ప్రజలు, తోటి సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## మైనార్టీలకు రంజాన్ తోఫాల పంపిణీ



**నేటి సాక్షి, కొమరం భీమ్ ఆసిఫాబాద్:** ఆసిఫాబాద్: రఘుపతి రావ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు గారి సౌజన్యంతో జిల్లా కేంద్రంలోని మాజీ డీసీసీ కార్యాలయ ఆవరణలో మైనార్టీలకు రంజాన్ పండుగను పురస్కరించుకొని తోఫాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీ అధ్యక్షుడు విశ్వ ప్రసాద్ రావు పాల్గొని లబ్ధిదారులకు తోఫాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతిముస్లిం పండుగను ఐక్యత, సోదరభావంతో ఘనంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్, మైనారిటీ నాయకులు ఎస్ కే అసద్, మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు మైనారిటీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

TGTEL/25/A1737 | NETI SAKSHI

# పశు వైద్యశాల.. ప్రభుత్వ స్థలం కబ్జా

**మరికల్ బీజేపీ నాయకులుము, వినతీ**




**నేటి సాక్షి నారాయణపేట, (ఇమామ్ సబ్):** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల కేంద్రంలో ఉన్న పశువుల వైద్యశాలకు సంబంధించిన స్థలం సర్వే నంబర్ 18/ఏ లో సుమారు ఒక్క ఎకరా భూమి గలదు, ఈ భూమి చాలా సంవత్సరాలుగా పశువుల వైద్యశాల ఆధీనంలోనే కొనసాగుతూ వస్తోంది, గతంలో ఈ స్థలంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ మరియు తాగునీటి సౌకర్యం కోసం బోర్ వేయడం జరిగింది, అలాగే ఈ స్థలం లోతట్టు ప్రాంతంగా ఉండటం వలన దాన్ని సమతలంగా చేయడానికి చుట్టూ మట్టి వేసి పూడ్చుడం కూడా జరిగింది, అయితే ప్రస్తుతం కొంతమంది వ్యక్తులు నకిలీ పత్రాలు (ఫేక్ డాకుమెంట్స్ ) సృష్టించి ఈ ప్రభుత్వ స్థలాన్ని తమదిగా చూపిస్తూ కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారు, ఇప్పటికే ఆ స్థలంలో మొరం వేసి తమ ఆధీనంలోకి తీసుకోవడానికి ప్రయత్నం చేస్తున్న పరిస్థితి ఉంది, కాబట్టి దయచేసి ఈ విషయంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించి, పశువుల వైద్యశాలకు చెందిన ఈ ప్రభుత్వ భూమి కబ్జాకు గురికాకుండా బౌండరీ ఏర్పాటు చేసి రక్షణ కల్పించవలసిందిగా, మరియు వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోగలరని వినయపూర్వకంగా కోరుతున్నాము, ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వేణు గోపాల్, నాయకులు రాజేష్ యాదవ్, మోహన్ రెడ్డి, శివ శివకుమార్, బాలరాజు గౌడ్, గుప్త, రమేష్, నరేష్, రవి, మహేష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# వేంకటేశ్వర ఆలయంలో చోరీ..

**రూ.10లక్షల ఆభరణాలు అపహరణ.. కేసు నమోదు చేసిన పోలీసులు..**



**నేటి సాక్షి, తిమ్మాపూర్:** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీలో గల వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. ఆలయ అర్చకులు సోమవారం సాయంత్రం పూజలు చేసి తాళాలు వేసి ఇంటికి వెళ్లారు. మంగళవారం ఉదయం ఆలయం శుద్ధి చేసేందుకు వచ్చిన సిబ్బందికి తాళాలు పగలగొట్టి ఉండడంతో పూజారులకు సమాచారనిచ్చారు. అర్చకులు వచ్చి పరిశీలించగా స్వామివారి కిరీటం, అమ్మవారి నగలు, ఇతర ఆభరణాలు కనిపించకపోవడంతో ఆలయ కమిటీతో పాటు పోలీసులకు సమాచారం అందించారు. దాదాపు ఆభరణాల విలువ రూ.10 లక్షల పైనే ఉంటుందని వారు తెలిపారు. ఎల్ఎండి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఫింగర్ ప్రింట్, క్లూస్ టీం విభాగాలకు సమాచారం అందించారు. ఆలయంలో దొంగతనం జరిగిన వార్త ఎల్ఎండీ తో పాటు మహాత్మానగర్ లో కలకలం సృష్టించింది. ఆలయ అర్చకుడు గోవర్ధన శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్ఎండీ పోలీసులు తెలిపారు.

# పోలీస్ స్టేషన్ 'స్వచ్ఛత'కు చర్యలు

**వెల్గటూర్ ఎస్సై పి.ఉదయ్ కుమార్**



**నేటి సాక్షి, ఎండపల్లి:** జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ (ఐఏఎస్) ఆదేశాల మేరకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా మంగళవారం వెల్గటూర్ పోలీస్ స్టేషన్‌లో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. వెల్గటూర్ సబ్ ఇన్‌స్పెక్టర్ పి.ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది అందరు కలిసి స్టేషన్ ఆవరణలో శుభ్రత పనులు చేపట్టారు. స్టేషన్ పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి, ప్రాంగణాన్ని శుభ్రపరిచి పరిశుభ్రమైన వాతావరణం ఏర్పడేలా చర్యలు తీసుకున్నారు. పోలీస్ స్టేషన్ కార్యాలయ గదులు, ఆవరణ, రహదారుల పక్కన ఉన్న చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు సిబ్బంది కృషి చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ పి.ఉదయ్ కుమార్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచడం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడం సాధ్యమవుతుందని తెలిపారు. పరిశుభ్రమైన వాతావరణం ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించడంలో కూడా కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్‌కు వాటర్ కూలర్ బహుకరణ



**నేటి సాక్షి గన్నేరువరం, (బుర్ర అంజయ్య గౌడ్ ):** గన్నేరువరం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్కు వాటర్ కూలర్ బహుకరణ చేయడమైంది బహుకరణ చేసిన వారు గన్నేరువరం సర్పంచ్ రంగనవేని లచ్చి నర్స్ ఉపసర్పంచ్ రామంచ స్వామి ఇట్టి కార్యక్రమంలో సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు సభ్యులు పాల్గొని బహుకరించారు బహుకరించారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు సభ్యులు పాల్గొన్నారు

# 90 లక్షల రూపాయల వ్యయంతో సిసి రోడ్ల నిర్మాణం



**నేటిసాక్షి ,న్యూస్ తిరుమలాయపాలెం(మెట్టు రుద్రరాజు):** తిరుమలాయపాలెం మండలంలోని బీరోలు పంచాయతీ, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక క్రింద వేగంగా అభివృద్ధి దిశగా పయనిస్తోంది. గ్రామ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్న నూతన సర్పంచ్ గుమ్మడి దేవ భిక్షం ఉప సర్పంచ్ పులుగుజ్జు మంగమ్మ గ్రామపంచాయతీ కార్యదర్శి బి. మౌనిక ఆధ్వర్యంలో గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు జోరుగా కొనసాగుతున్నాయి. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఖమ్మం పొంగులేటి క్యాంప్ ఆఫీస్ ఇంచార్జ్ తంబూరి దయాకర్ రెడ్డి కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు రామ సహాయం నరేష్ రెడ్డి కాంగ్రెస్ మండల నాయకులు కొప్పుల రాంరెడ్డి అండదండలతో గ్రామానికి అవసరమైన మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించబడుతోంది. గ్రామంలో నూతన సీసీ రోడ్ల నిర్మాణం, పాత రోడ్ల మరమ్మతులు, వంటి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికల కార్యక్రమం ద్వారా గ్రామంలో చెత్త నిర్వహణ, పచ్చదనం పెంపు, గ్రామ సౌందర్యవర్ధక చర్యలు చేపట్టడం వల్ల బీరోలు గ్రామం క్రమంగా ఆదర్శ గ్రామంగా మారుతోంది. గ్రామ ప్రజల సహకారంతో పాటు ప్రజాప్రతినిధుల సమన్వయం ఈ అభివృద్ధికి ప్రధాన కారణమని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తూ, గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి ముందుకు సాగుతున్న గ్రామపంచాయతీ యంత్రాంగం ప్రశంసలు అందుకుంటోంది. మొత్తం మీద, పల్లె ప్రగతి ప్రణాళిక కింద బీరోలు గ్రామపంచాయతీ అభివృద్ధి పథంలో దూసుకుపోతూ, ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తోంది. ఈ సందర్భంగా సర్పంచ్ గుమ్మడి దేవా బిక్షం మాట్లాడుతూ సి ఆర్ ఆర్ పథకం క్రింద 63 లక్షల రూపాయలు , ఎన్ఆర్ఈజీఎస్ పథకం క్రింద 3 లక్షల రూపాయలు మొత్తం 90 లక్షల రూపాయలు నిధులు గ్రామ అభివృద్ధికి మంజూరయ్యాయని ఈ నిధులతో గ్రామంలో సీసీ రోడ్లు సైడు కాలువలు పాత రహదారుల మరమ్మతులు చేపట్టినట్లు పేర్కొన్నారు. అలాగే గ్రామంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడం తాగునీటి సౌకర్యాలు విస్తరించటం విద్యుత్ మరియు ఇతర మౌలిక వసతులు బలోపేతం చేయడంపై దృష్టి పెట్టినట్లు.గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.గ్రామ ప్రజల సహకారం లేకుండా అభివృద్ధి సాధ్యం కాదని అందరి కలిసికట్టుగా గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని సర్పంచ్ గుమ్మడి దేవబిక్షం పిలుపునిచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకాన్ని గ్రామానికి తీసుకువచ్చి ప్రజలకు ప్రయోజనం చేకూర్చే విధంగా కృషి చేస్తారని ఈ సందర్భంగా గుమ్మడి దేవ బిక్షం తెలిపినారు

# అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు




**నేటి సాక్షి (కరీంనగర్):** మహమ్మద్ ప్రవక్త బోధనలు చాలా విలువైనవని మరియు మానవ శ్రేయస్సుకై ఉపకరిస్తాయని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు & విఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు "అల్ఫోర్స్" నరేందర్ రెడ్డి గారి ఆధ్వర్యంలో కరీంనగర్లోని కరీంనగర్ ఫంక్షన్ ప్యాలెస్ లో పవిత్రమైన రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసినటువంటి ఇఫ్తార్ విందుకు సుధా చైర్మన్ శ్రీ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి గారు ముఖ్యఅతిథిగా హాజరై వారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవిత్రమైన రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదరులు చేసేటువంటి కఠినమైన ఉపవాస దీక్ష చాలా సత్ఫలితాలు ఇవ్వడమే కాకుండా వారి యొక్క జీవితంలో విజయాలు అందిస్తుందని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదని వాళ్ళు చెప్పారు. నరేందర్ రెడ్డి గారు చేసేటువంటి సేవలు స్ఫూర్తిదాయకమని వారు కొనియాడారు. "అల్ఫోర్స్" నరేందర్ రెడ్డి గారు మాట్లాడుతూ విఎన్ఆర్ ఫౌండేషన్ ఆరంభం నాటి నుండి ఈ సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్నామని మరియు ప్రవక్త యొక్క ఆశీస్సులు ప్రతి ఒక్కరి మీద ఉండాలని మరియు సమాజ శ్రేయస్సుకై ప్రతి ఒక్కరు కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. ముస్లిం సోదరులందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ శాంతికి ప్రతీక అయిన రంజాన్ పండుగను ప్రతి ఒక్కరు ఘనంగా జరుపుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ కుమార్ గారు, నూతనంగా ఎన్నుకోబడ్డా మున్సిపల్ కార్పొరేషన్ మైనార్టీ కార్పొరేటర్స్,పలువురు ముస్లిం మత పెద్దలు, PRTU TS జిల్లా అధ్యక్షులు అయిలేని కరుణాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్రి జైపాల్ రెడ్డి పంచాయతీరాజ్ మాసపత్రిక సంపాదకవర్గ సభ్యుడు అబ్దుల్ జమీల్, చిట్నేని శ్రీకాంత్ రావు, మైనార్టీ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎండి ఉమర్ అలీ ప్రధాన కార్యదర్శి హబీబుర్రహ్మాన్ ఉపాధ్యాయులు ఉద్యోగులు మరియు మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మెట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో 'క్లీన్ అండ్ గ్రీన్' కార్యక్రమం



- **'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా మెట్ పల్లి పోలీసుల ముందడుగు**

**నేటి సాక్షి, మెట్‌పల్లి,( రాధారపు నర్సయ్య ):** 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా మెట్ పల్లి పోలీస్ స్టేషన్ పరిసరాలను శుభ్రంగా, పచ్చదనంతో తీర్చిదిద్దేందుకు ఎస్ఐ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో 'ప్రిమిసెస్ మెయింటెనెన్స్ - క్లీన్ & గ్రీన్'కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలకు ఆదర్శంగా నిలవాలనే ఉద్దేశంతో మెట్ పల్లి పోలీస్ స్టేషన్‌లో శుభ్రత మరియు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని మెట్ పల్లి సిఐ అనిల్ కుమార్,ఎస్ఐ కిరణ్ కుమార్ సీఐ సమక్షంలో సిబ్బందితో కలిసి నిర్వహించారు. స్టేషన్ పరిసరాల్లో చెత్తను తొలగించడం, మొక్కలు నాటడం, పచ్చదనం పెంపు వంటి చర్యలు చేపట్టారు ఈ కార్యక్రమంలో భాగంగా పోలీస్ సిబ్బంది స్టేషన్ ప్రాంగణాన్ని పూర్తిగా శుభ్రపరిచి, చెత్తను తొలగించారు. అదేవిధంగా పర్యావరణ పరిరక్షణకు మద్దతుగా మొక్కలు నాటడం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించేందుకు చర్యలు తీసుకున్నారు. ప్రజా సేవలో భాగంగా పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వడం పోలీసుల బాధ్యత అని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. 'క్లీన్ & గ్రీన్' వంటి కార్యక్రమాలు కేవలం ప్రభుత్వ పరిమితి కాకుండా ప్రజల భాగస్వామ్యంతోనే విజయవంతమవుతాయని తెలిపారు.

# ఇసుక డంపును సీజ్ చేసిన రెవిన్యూ అధికారులు



**నేటి సాక్షి అనంతగిరి:** సూర్యాపేట జిల్లా అనంతగిరి మండల పరిధిలోని పాలవరం గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన మూడు ఇసుక డంపులను రెవెన్యూ ఇన్స్పెక్టర్ వెంకట నగేష్ గుర్తించి సీజ్ చేసినట్లు మండల తహసీల్దార్ తెలిపారు.పట్టుకున్న ఇసుక సుమారు 43 ట్రిప్పుల వరకు ఉంటుందని తెలిపారు.సీజ్ చేసిన ఇసుక డంపులను గ్రామ పంచాయితీకి అప్పగించినట్లు చెప్పారు.ఈ సందర్భంగా తహసీల్దార్ హిమ బిందు మాట్లాడుతూ అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు.అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రభుత్వ అనుమతులతో ఇసుక రవాణా చేయాలని సూచించారు.

# మూసా అలీ ఖాన్ కు.. సన్మానం




**నేటిసాక్షి, మిర్యాలగూడ :** ఇంటర్నేషనల్ ఉమెన్స్ ఇన్స్పిరేషన్ అవార్డ్స్ -2026 కార్యక్రమాన్ని వంశీ టీవీ ఛానల్ మోర్ద ఫౌండేషన్ సంయుక్తంగా అవార్డుల కార్యక్రమాన్ని హైదరాబాదులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మిర్యాలగూడ నటుడు, సామాజికవేత్త మూసా అలీ ఖాన్ కు సెలబ్రిటీ అవార్డు అందజేసి, ఘనంగా సన్మానించారు. అవార్డు గెలుచుకున్న మూసా అలీ ఖాన్ కళా సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొంటూ ఉభయ రాష్ట్రాలలో తనకంటూ గుర్తింపు తెచ్చుకొని, కళాకారులను, కళా సంస్థలకు కార్యక్రమ నిర్వాహకులకు పరిచయం చేస్తూ, సహాయ సహకారాలు అందిస్తున్నందుకు, సినీ నటులు పృథ్వి, సీనియర్ నటులు బాబు మోహన్, వంశీకృష్ణ, మోర్దు శ్రీనివాస్, ప్రఖ్యాత సినీ కెమెరామెన్ సతీష్ రెడ్డి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.